జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
09, జూలై, 2026

# మై భారత్ రిజిస్ట్రేషన్ డ్రైవ్‌కు శ్రీకారం

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 8(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలో మై భారత్ (మేరా యువ భారత్) ఇంటెన్సివ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ప్రారంభించారు. జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు నిర్వహించే ఈ డ్రైవ్‌లో 15 నుంచి 29 సంవత్సరాల యువత mybharat.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. నమోదు చేసుకున్న యువతకు ప్రభుత్వ యువజన కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలో నమోదు లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి గ్రామం, మండలంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్, జిల్లా యువజన ట క్రీడల అధికారి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.







# పేదవాళ్ల ఆత్మగౌరవానికి చిహ్నాం ఇందిరమ్మ ఇండ్లు

**- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాల అమలు**
**- రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**- ర్యాలంపాడులో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం**

**గద్వాల నడిగడ్డ,జులై 8(జనంసాక్షి);** పేదవాళ్ల ఆత్మగౌరవానికి చిహ్నాంగా ఇందిరమ్మ ఇండ్లు నిలుస్తాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ధరూర్ మండలం ర్యాలంపాడు పునరావాస గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామానికి చేరుకున్న మంత్రులకు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మేల తాళాలతో, బాణసంచా కాలుస్తూ ముఖ్య అతిథులను ఘనంగా స్వాగతించారు. ఇందిరమ్మ ఇండ్ల శిలాఫలకాన్ని ప్రారంభించిన మంత్రి పలువురు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. గ్రామంలో మొత్తం 26 మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకోగా ప్రజాప్రతినిధులు గ్రామానికి చెందిన సరోజ, గోవిందమ్మ, విశాలాక్షి, జయమ్మ ఇండ్లను ప్రారంభించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారులకు కానుకలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రసంగిస్తూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకుందని, పాలమూరు బిడ్డే మన ముఖ్యమంత్రి కావడం గర్వకారణమన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా కొత్త కార్యక్రమాలను కూడా అమలు చేసి ప్రజలకు చేరువ కావడం జరిగిందన్నారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, రెండో విడతలోను అర్హులైన వారందరికీ ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సాయం అందజేస్తుందన్నారు. మూడు, నాలుగు విడతల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇటీవల కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి వారి ఖాతాల్లో వారం రోజుల్లోనే డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. గద్వాల నియోజకవర్గంలో వివిధ మండలాల్లో తహసిల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణాలకు ఈ వేదికపై నుంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలు దేవుళ్ళతో సమానమని, వారి త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ముంపు గ్రామాల ప్రజల సహకారంతోనే ప్రాజెక్టులను



నిర్మించుకొని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. పార్టీలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, నిర్మించుకునేందుకు సహకారం అందిస్తున్నామన్నారు. గుడిసెలు, పెంకుటిల్లు ఉన్న వారికి కూడా పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింపజేయనున్నట్లు చెప్పారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్మాణంతో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామంటే ఆ ఘనత నిర్వాసితులైన ఈ గ్రామస్తులదేనని ప్రశంసించారు. ఆలూరు, గుడ్డెం దొడ్డి, చిన్నోనిపల్లి వంటి ముంపు గ్రామాల బాధితుల కష్టాలు తీర్చేందుకు పునరావాస కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అందులో భాగంగానే ర్యాలంపాడు పునరావాస గ్రామంలో 236 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించడం జరిగిందన్నారు. పునరావాస గ్రామాల్లో నివసించే ప్రజలందరికీ ప్రభుత్వం అండగా నిలబడి, అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ర్యాలంపాడుతో పాటు జిల్లాలోని ఇతర పునరావాస గ్రామాల్లోని ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్ల రేషన్ కార్డు ఉన్నవారందరికీ సన్న బియ్యం, తదితర కార్యక్రమాలతో ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ధరూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి గ్రామ సమస్యలపై ప్రసంగించి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే 62 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.5.74 కోట్ల విలువైన ఇందిర మహిళా శక్తి బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, గద్వాల మున్సిపల్ చైర్పర్సన్ తుమ్మల జయలక్ష్మి, గ్రామ సర్పంచి వెంకటరామిరెడ్డి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.




## కన్నతల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

**టేక్మాల్, జులై 8 (జనంసాక్షి):**
టేక్మాల్ మండలం ఎల్పుగొండ గ్రామానికి చెందిన సుదర్శన్ తన తల్లి సత్యమ్మను హత్య చేసిన కేసులో మెదక్ జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు బుధవారం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మద్యానికి బానిసైన సుదర్శన్ 08-11-2025 అర్ధరాత్రి మద్యం మత్తులో డబ్బుల విషయంలో తల్లితో గొడవపడి కర్రతో తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేశారు. అల్లాదుర్గ్ సీఐ రేణుక శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలు మరియు సాక్ష్యాలను సేకరించి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ నిందితుడిని దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు విధించారు. ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్‌తో పాటు దర్యాప్తు అధికారి, కోర్టు లైజన్ అధికారులు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## నర్సాపూర్‌లో గంజాయి ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

**- ముగ్గురు అరెస్ట్, 870.6 గ్రాముల గంజాయి స్వాధీనం**



**నర్సాపూర్, జూలై 8 (జనంసాక్షి):** నర్సాపూర్ పోలీసుల చాకచక్యంతో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 870.6 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, జిప్‌లాక్ కవర్లు, బ్యాగ్, పెన్‌డ్రైవ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో బుధవారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా నిందితులు పట్టుబడ్డారు. ప్రధాన నిందితుడు కూనపులి వికాస్ గతంలో కూడా ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ (NDPS) చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారదాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఏసీబీ వలలో సర్వే సూపరింటెండెంట్

**- ఫైలు ముందుకు కదలాలంటే లంచం... గ్రామ మ్యాప్ సవరణకు రూ.15 వేల డిమాండ్**

**- లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడి**



**మహబూబ్‌నగర్, భూత్పూర్ జులై 08 (జనంసాక్షి):** గ్రామ మ్యాప్ సవరణ ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపించేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా మహబూబ్‌నగర్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్ రెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భూత్‌పూర్ మండలానికి చెందిన గ్రామ మ్యాప్ సవరణకు సంబంధించిన ఫైల్‌ను పై అధికారులకు పంపించేందుకు ఆయన ఫిర్యాదుదారుడి నుంచి రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.

ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు మహబూబ్‌నగర్ ఐడీఓసీ లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో ఉచ్చుపన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలో వెంకటేశ్వర్ రెడ్డిని పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## పెసర పంటలో అధిక దిగుబడి కోసం రైజోబియం కల్చర్‌తో విత్తన శుద్ధి



**టేక్మాల్, జులై 8 (జనంసాక్షి):** పెసర పంటలో అధిక దిగుబడితో పాటు మెరుగైన వేరు గడ్డల అభివృద్ధి కోసం టేక్మాల్ గ్రామానికి చెందిన రైతు కమ్మరి రాములు తన పొలంలో పెసర విత్తనాలకు రైజోబియం కల్చర్‌తో విత్తన శుద్ధి చేసి విత్తడం జరిగింది. రైజోబియం కల్చర్‌తో విత్తన శుద్ధి చేయడం వల్ల వేర్లపై బుడిపెలు (నాడ్యూల్స్) సమృద్ధిగా అభివృద్ధి చెంది, వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరించే ప్రక్రియ జరుగుతుంది. దీంతో మొక్కల పెరుగుదల మెరుగుపడి, అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ, రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల సాగు చేపట్టి, విత్తన శుద్ధి వంటి సాంకేతికతలను పాటించడం ద్వారా మంచి దిగుబడులు, అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు.

## ఘనంగా వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు

**- దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి, సేవలు మరువలేనివి**

**- సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్**



**కౌడిపల్లి జూలై 08,(జనంసాక్షి):** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కౌడిపల్లి గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, ఆధ్వర్యంలో దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి,77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ హయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజురియంబస్మెంట్,వంటి పథకాలు లక్షలాది పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమ కోసం అనేక ప్రజాహిత పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్,వార్డు సభ్యులు మక్బూల్, సింగూరి దేవేందర్, గుడ్డంల శరత్, మెగావత్ రమేష్, గ్రామ పెద్దలు పుండరీకం గౌడ్, సత్యనారాయణ గౌడ్, మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కౌడ శ్రీనివాస్ గుప్తా, రాగుల భూమయ్య పటేల్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు

**నర్సాపూర్, జులై 8 (జనంసాక్షి):** నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్ పార్క్‌లో బుధవారం మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల సేవలో అంకితభావంతో పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్,



నర్సాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అశోక్, జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, స్వాతి, నాయకులు రాధాకృష్ణ, మన్నే శ్రీనివాస్, మహేష్, చారి, దాడిగా నరేష్, లక్ష్మణ్ నాయక్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొని డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డికి నివాళులర్పించారు.

## సజ్జాపూర్ మెథడిస్ట్ చర్చ్ అవర్ గోడ నిర్మాణం కొరకు ఆర్థికసాయం

**- పీచరాగడి తాండా సర్పంచ్ వినోద్ రాథోడ్ శాలువతో సన్మానం చేశారు**



**కోహిర్, జులై 8 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం నియోజకవర్గంలో గ్రామం సజ్జాపూర్ చర్చ్ నిర్మాణం కొరకు పీచరాగడి తాండా సర్పంచ్ వినోద్ రాథోడ్ శాలువతో చర్చి పాస్టర్ సన్మానం చేశాడు మరియు సజ్జాపూర్ గ్రామ ఉపసర్పంచ్, సురేష్ ప్రోత్భలంతో,మెథడిస్ట్ చర్చ్ అవర్ గోడ నిర్మాణం కొరకు పిచేరాగడి గడి తాండ సర్పంచ్ వినోద్ కుమార్ చర్చి అవర్ కూడా నిర్మాణం కొరకు అడిగిన వెంటనే 50 బస్తాల సిమెంట్ ఇస్తానని మాట ఇచ్చాడు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రెవరెండ్ బాలరాజ్ పాస్టర్,గ్రామ ఉపసర్పంచ్ మైసయ్య,రిపోర్టర్ సుధాకర్,రైటర్ డేవిడ్,ఫీల్డ్ అసిస్టెంట్ జైపాల్, అశోక్, యేసయ్య. సైదు. నర్సింలు. దేవయ్య,సైదురత్నయ్య సుఖేందర్ చింటూ రత్నయ్య, చర్చ్ సంఘస్తులు పాల్గొన్నారు.

## జన హృదయ నేత డాక్టర్ వైఎస్సార్‌కు ఘన నివాళులు



**కోహెడ, జూలై 08 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దివంగత ముఖ్యమంత్రి, ప్రజానాయకుడు డాక్టర్ వై. ఎస్. రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పార్టీ నాయకులతో కలిసి వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్సార్ ప్రజల సంక్షేమాన్ని జీవిత లక్ష్యంగా తీసుకుని రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రజాసేవకు ఆయన చూపిన అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బందెల సుజాత – బాలకిషన్ వివిధ గ్రామాల సర్పంచ్ లు , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెల్మకన్న గ్రామంలో SIR ఫారాల నమోదు కార్యక్రమం



**కౌడిపల్లి జూలై 08, (జనంసాక్షి):** మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, వెల్మకన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం 96, 97 బూత్ లకు సంబంధించి SIR (Special Intensive Revision) ఫారాల నమోదు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడిందని మాజీ సర్పంచ్ రాజేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటరు వివరాల నమోదు, సవరణలు, మార్పులు, చేర్పుల కోసం సర్ ఫారాలను సమర్పించారని రాజేందర్ అన్నారు. సంబంధిత బిఎల్ఓ, బిఎల్ఎలు ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తూ, ఫారాల స్వీకరణ ప్రక్రియను నిర్వహించారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని సంబంధిత అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచ్ రాజేందర్, వార్డు మెంబర్ లు అశోక్, రాజేష్, కారోబార్ నాగభూషణం, బిఎల్ఓలు ప్రవళిక, సునీత, బిఎల్ఎలు వనమాల రాజు, రవిసాగర్, గ్రామస్తులు ననువాల సతీష్, మహేష్, దుర్గ్యా, బిక్షపతి పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్ బి.అశోక్



**కొండాపూర్, జూన్ 8 (జనంసాక్షి):** మండల కేంద్రమైన కొండాపూర్ గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నేడు మండల తహసీల్దార్ ఎంపీడీవో, సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రక్రియ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, సంబంధిత అధికారుల పనితీరును వారు పరిశీలించి, విధులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్, ఎంపీడీవో సౌమ్యశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు ఆపద్బాంధవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి

**- కాంగ్రెస్ టౌన్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు**



**మక్తల్, జూలై 08 (జనంసాక్షి):** రైతుల పాలిట ఆపద్బాంధవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెసు నాయకులు కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సేవలను కొనియాడారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎంపికై, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు ఎంపీగా ప్రజా జీవితంలో ఓటమి ఎరుగని నాయకుడిగా వైఎస్సార్ ప్రజల మన్ననలను పొందారని కీర్తించారు. వైఎస్ఆర్ చేపట్టిన పాదయాత్ర చరిత్ర సృష్టించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞంతో అనేక ప్రాజెక్టులు నిర్మించారని తెలిపారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డి దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, నాయకులు లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్వూరి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్లు, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి : కమిషనర్ మహమ్మద్ షేక్

**- కల్వకుర్తి 19వ వార్డులో ఇంటింటా ఓటరు ధ్రువీకరణ కార్యక్రమం**



**కల్వకుర్తి,జూలై 8,(జనంసాక్షి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ కోరారు. పట్టణంలోని 19వ వార్డు సుభాష్‌నగర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు,తొలగింపులకు సంబంధించిన ఫారాలను బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నారని తెలిపారు.అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను ధ్రువీకరించుకుని అవసరమైన పత్రాలతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రజలు అపోహలకు గురికాకుండా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అలివేలు, శ్రీనివాసాచారి, రెహానా, శారద, సువర్ణ, హిమాయత్‌తో పాటు పలువురు ఓటర్లు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో అన్నప్రసాద వితరణ



**జడ్చర్ల, జూలై 8 (జనంసాక్షి):** జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బుధవారం సద్గురు అయ్యప్ప స్వామి ఆటో ఫైనాన్స్ ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో రోగులకు, వారి సహాయకులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి బుధవారం ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణీలు ఆహారం విషయంలో ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టి నట్లు తెలిపారు. ప్రస్తుతం సుమారు 200 మందికి పైగా అన్నప్రసాదాన్ని అందజేస్తున్నామని, భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ సభ్యులు కిట్టు, వెంకటేష్, అబ్దుల్లా, చింటూ, రాజు, రఘు, వెంకటేష్, నరసింహ పాల్గొన్నారు.

## జూదరుల.. పట్టివేత

**పాపన్నపేట, జులై 8 (జనంసాక్షి):**

జూదం ఆడుతున్న పలువురిని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం నార్సింగి గ్రామ శివారు ప్రాంతం సేవాలాల్ ఆలయ సమీపంలో పలువురు జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుండి రూ.5.450 నగదు,ఆరు చరవాణిలు,ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

## సర్- హెల్ప్ డెస్క్ ప్రారంభించిన వార్డు కౌన్సిలర్



**మక్తల్, జూలై 08 (జనంసాక్షి):** మక్తల్ మున్సిపాలిటీ 16వ వార్డులో సర్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు వార్డులోని ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటరు ఫామ్‌లు నింపడం కోసం హెల్ప్ డెస్క్ ను బుధవారం స్థానిక వార్డు కౌన్సిలర్ అల్వూరి పావని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ ప్రక్రియ అత్యంత కీలకమని, ఒక్క తప్పు కూడా లేకుండా, సర్ ప్రక్రియ లో భాగంగా ఓటరు ఫారాలను అడిగిన అన్ని వివరాలు జోడించి, ఫారాలను బీఎల్వోలకు నిర్ణీత సమయంలో అందించాలని సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా ఫారాలు నింపి ఇవ్వకపోయినా, వివరాలు అందించకపోయినా ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. హెల్ప్ డెస్క్ ఓటర్లకు అండగా నిలిచి, ఫారాలపై అవగాహన కల్పించి, సరిగా నింపి ఇవ్వడంలో సహకరిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ శాలం, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్వూరి రవికుమార్, హెల్ప్ డెస్క్ ప్రతినిధులు అప్రోచ్, నవీద్, నాదర్, రంజాన్, బాసిత్, రాజశేఖర్, తౌఫిక్ అహ్మద్, యూసుఫ్, నారాయణరెడ్డి, మదన్, వినయ్, శ్రీహరి, అశోక్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ మండల కేంద్రంలో ఘనంగా రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు



**- ధన్వాడ, జూలై 8 (జనంసాక్షి):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ధన్వాడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒగ్గు రాజు, పట్టణ అధ్యక్షులు జట్రం లక్ష్మయ్య గౌడ్, రామచందర్, రాజేష్ గౌడ్, సుధాకర్ రెడ్డి, అబ్దుల్ యూసుఫ్, జేసీబీ రాజు, నవీన్, హర్షవర్ వెంకట్, అరుణ్, మునీష్ ఖాన్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ర్యాలంపాడులో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మంత్రులు



**ధరూర్, జూలై 8 (జనంసాక్షి):** ర్యాలంపాడులో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అధికారులను సమాయత్తం చేస్తున్నారు. వారి వెంట జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహావిష్కరణ



**నాగర్ కర్నూల్, జూలై 8 (జనంసాక్షి):** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**వెల్దండ, జూలై 8 (జనంసాక్షి):** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గంగాపురం చిన్నయ్యకు మంజూరైన రూ.34,500 రూపాయలు, మాడుగుల శ్రీశైలంకు రూ.14,000 వేల రూపాయల చెక్కును బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద రోగులకు తక్షణ ఆర్థిక ఖర్చులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపే సంజీవనిలా పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ,దుబ్బ తండా శ్రీను నాయక్, అనిల్ కుమార్, హర్య నాయక్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అత్యపత్య పోటీలకు ఆలేరు విద్యార్థి ఎంపిక



**తెలకపల్లి, జూలై 08, (జనంసాక్షి):** జిల్లాస్థాయి అత్యపత్య క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి నరహరి బుధవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూలై 7న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మండల పరిధిలోని ఆలేరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి బి. గౌతమ్ రాజు సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ చాటుతూ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 11, 12 తేదీల్లో సిద్దిపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి అత్యపత్య క్రీడా పోటీల్లో గౌతమ్ రాజు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.బాలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ టి. ఆనంద్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అమృతం, గ్రామ పెద్దలు గౌతమ్ రాజును అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి జిల్లా, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మెదక్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 8 (జనంసాక్షి):** జిల్లాలోని చారిత్రక, వారసత్వ ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి మెదక్‌ను రాష్ట్రంలోనే ప్రముఖ టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశం చారు. ఇందుకోసం అన్ని ప్రాజెక్టుల కు సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధం చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ, పురావస్తు శాఖతో పాటు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని పురావస్తు సంపదను శాస్త్రీయంగా పరిరక్షించడంతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి దేవాలయం అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక శాఖ ఇటీవల మంజూరు చేసిన రూ.7 కోట్లతో కాటేజీల నిర్మాణం, ఆలయ మాస్టర్ ప్లాన్ రూపకల్పన, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

అలాగే మెదక్ ఖిలా, పోచారం డ్యామ్, బారాకమాన్, గోల్ బంగ్లా తదితర చారిత్రక ప్రాంతాల అభివృద్ధి, పరిరక్షణ కోసం డీపీఆర్‌లు రూపొందించి పనులు ప్రారంభించాలని తెలిపారు. పురావస్తు, పర్యాటక శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి జిల్లాలోని వారసత్వ సంపదను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. మెదక్ ఖిలా అభివృద్ధికి రూ.57 లక్షలు, ఏడుపాయల దేవాలయంలో కాటేజీల నిర్మాణానికి రూ.7 కోట్లను రాష్ట్ర పర్యాటక శాఖ మంజూరు చేసిన నేపథ్యంలో పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల భాగస్వామ్యంతో మెదక్‌ను పర్యాటకులకు ఆకర్షణీయమైన టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేసి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు పటిష్ట ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్, తెలంగాణ టూరిజం ప్రతినిధులు రామకృష్ణ, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఈఈ శ్రీశైలం, కన్సల్టెంట్ అమృత, డీఎఫ్ఓ జోజి, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీపీఓ యాదయ్య, ఏడుపాయల దేవాలయ ఈవో వీరేశం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థాయిని పెంచే... హోదాను ఇవ్వండి



**శివ్వంపేట, జూలై 8 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం భిక్యా తండా కు చెందిన తిరుపతి రాథోడ్‌ను నేను ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కొనసాగు తున్నానని తిరుపతి రాథోడ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను గతంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా 2014 నుంచి 2017 వరకు పని చేశాను. ప్రస్తుతం ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాననని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నా శ్రాయశక్తుల కృషి చేశాను. పార్టీ ఏ పిలుపు ఇచ్చిన ఆ కార్యక్రమం విజయవంతం కోసం శ్రమించినాను. కాబట్టి మీరు స్పందించి నాకు నర్సాపూర్ నియోజకవర్గ ఎస్టి సెల్ అధ్యక్షుడిగా పదవి ఇప్పించగలరని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి లకు యొక్క విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. మీరు నా యొక్క పనితనాన్ని చూసి మీరు ఈ పదవి ఇవ్వాల్సిందిగా మనస్పూర్తిగా కోరుతున్నానని తిరుపతి రాథోడ్ తెలియజేశారు.

# అమరచింత ఎస్సీ హాస్టల్‌కు కాంపౌండ్ వాలు నిర్మించాలి



**అమరచింత, జూలై 8(జనంసాక్షి):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యస్. అజయ్ డిమాండ్ చేశారు. బుధవారం నాడు సాయంత్రం తమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సమస్యలు తెలుసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయని వారు తెలిపారు. అసంపూర్తిగా కాంపౌండ్ వాళ్ళు ఉండడంతో విద్యార్థులు పందుల బెడద అడవి దగ్గరగా ఉండడంతో పాములు వచ్చే అవకాశం ఉందని వాపోయారు. కనుక వెంటనే అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్ వాలు పూర్తిగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులసంఖ్యకు అను గుణంగా బాత్రూం లు స్నానపు గదులు అదనంగా మంజూరు చేయాలని ఆయన కోరారు. గత మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న వర్కర్స్ వేతనాలను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్స్ ఓపెన్ చేసి నెల రోజులు అవుతున్నప్పటికీ ఇంకా నోట్ బుక్స్ అందలేదని ప్రభుత్వం రెండు జతల బట్టలు కూడా వెంటనే ఇవ్వాలని కోరారు. ప్రతి విద్యార్థికి స్పోర్ట్స్ బట్టలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి హాస్టల్ ఒక పీటిని ప్రభుత్వం నూతనంగా నియమించి స్పోర్ట్స్ ప్రాధాన్యతను పెంచాలని కోరారు. ఈ సర్వే కార్యక్రమంలో అమరచింత మండల అధ్యక్షులు కే శంకర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే పల్లెలకు అభివృద్ధి బాట

**- ప్రతి గ్రామానికి నిధులు - సర్పంచులు బాధ్యతగా పనిచేయాలి - మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ**



**మహమ్మదాబాద్,జూలై 08 (జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు విడుదల చేస్తున్నదని మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. బుధవారం మీడి యాతో మాట్లాడిన ఆయన..గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ.. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను సర్పంచ్‌గా ఉన్న సమయం లో సొంత నిధులతో సీసీ రోడ్లు,డ్రైనేజీలు,వీధి దీపాలు వంటి అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొన్నానని గుర్తుచేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెండింగ్ బిల్లులు విడుదల కావడంతో ఉపశమనం లభించిందన్నారు. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లపై మట్టి పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోడ్లపై మట్టి తొలగించడంతో పాటు మురుగునీరు నిల్వకాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రత, మౌలిక వసతుల పరిరక్షణపై స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించా లని ఆయన కోరారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ



**రాజాపూర్, జూలై 8(జనంసాక్షి):** రాజాపూర్ మండల కేంద్రంలో, కల్లేపల్లి, రాయపల్లి గ్రామా లలో మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకె అరుణ సిసి రోడ్లు, హైమాక్స్ వీధి దీపాలు ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు బాలాత్రిపుర సుందరి, ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి , జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఆనంద్, జిల్లా నాయకులు రాపోతుల శ్రీనివాస్ గౌడ్, తిరుపతి, రాజాపూర్ సర్పంచ్ రామాకృష్ణ, అశోక్ గుప్తా, రాయపల్లి సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన పుప్పాల వాగు బ్రిడ్జి... తక్షణమే శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

**- వర్షాలు ముదిరేలోపు చర్యలు తీసుకోవాలి : మాజీ సర్పంచ్ చేప్యాల స్వామి**





**రామాయంపేట, జూలై 8 (జనంసాక్షి):** రామాయంపేట మండలం లోని పర్వతాపూర్-కాట్రియాల్ గ్రామాల మధ్య ఉన్న పుప్పాల వాగు బ్రిడ్జి గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతరం అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి మట్టి రహదారిని ఏర్పాటు చేసినప్ప టికీ, ప్రస్తుత వర్షాకాలంలో కురుస్తున్న స్వల్ప వర్షాలకే రహదారి మళ్లీ కోతకు గురవుతూ బ్రిడ్జి మరింత ప్రమాదకరంగా మారింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చేప్యాల స్వామి మాట్లాడుతూ, గత వర్షాకాలంలో దెబ్బతిన్న బ్రిడ్జికి అధికారులు తాత్కాలిక మరమ్మతుల తోనే సరిపెట్టారని, శాశ్వత పరిష్కారం కోసం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతుండటంతో ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పర్వతాపూర్, కాట్రియాల్ గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఈ బ్రిడ్జి ప్రధాన రాకపోకల మార్గమని, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.భారీ వర్షాలు కురిసేలోపు అధికారులు అత్యవసరంగా బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైతే కొత్త వంతెన నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.

# పరారీలో ఉన్న న్యూసెన్స్ కేసు నిందితుల అరెస్ట్



**తూప్రాన్, జూలై 8(జనంసాక్షి):** గత సంవత్సరం తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో బార్‌లో మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించడం, అక్కడ ఉన్న ఇతరులకు ఇబ్బందులు కలిగించడం నిందితులు కేసు నమోదు చేయగా అనంతరం పరారీలో ఉన్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు తూప్రాన్ ఎస్సై గంగారాజు తెలిపారు. తూప్రాన్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో ఉంటున్న సంతోష్ సింగ్, శంకర్ సింగ్, అమీర్ సింగ్ లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై నిరంతరం నిఘా ఉంచిన తూప్రాన్ పోలీసులు, ఈరోజు పరారీలో ఉన్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి నిందితులను గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ పోలీసులు తెలిపారు.

## చిన్నచింతకుంటలో
## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**నర్సాపూర్, జూలై 8 (జనంసాక్షి):** కృషి విజ్ఞాన కేంద్రం, తునికి ఆధ్వర్యంలో చిన్నచింతకుంట గ్రామంలో సర్పంచ్ ప్యాట సరిత-మహేష్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యార్థులు గ్రామ పంచాయతీ వద్ద గ్రామ పటాన్ని రూపొందించి, పంటల సాగు, చీడపీడల సమస్యలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటయ్య, నాయకులు నరసింహారెడ్డి, ప్రభాకర్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 10న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి




**మెదక్ టౌన్, జూలై 08, (జనంసాక్షి):** ఈనెల 10న (శుక్రవారం) ఏఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌కు మెదక్ జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పూర్తి సహకారం అందించాలని ఏఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రచకలి పాపయ్య ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం - ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈబంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలనీ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకు రావాలనీ సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలనీ తెలిపారు. నాణ్యమైన,ఉచిత విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనీ జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు,యువత, తల్లిదండ్రులు, ప్రజా స్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయాలి

**- 100 శాతం రాయితీపై విత్తనాలు అందుబాటులో**

**గుమ్మడిదల, జూలై 8 (జనంసాక్షి):** పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు అధిక సాంద్రత పద్ధతి (HDPS)ను అనుసరించాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. ఈ విధానంలో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటి, తక్కువ పెట్టుబడితో సాధారణ సాగుతో పోలిస్తే 30 నుంచి 40 శాతం వరకు అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. వర్షాధార, ఎర్ర నేలలు, చల్కా నేలలకు ఈ పద్ధతి అనుకూలమని పేర్కొన్నారు. వరుసల మధ్య 90 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 నుంచి 20 సెంటీమీటర్ల దూరం పాటించాలని సూచించారు. కలుపు నివారణ, సమతుల్య ఎరువుల వినియోగం, మొక్కల ఎదుగుదల నియంత్రణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ఈ వానాకాలం-2026లో గుమ్మడిదల మండలంలో 4 ఎకరాలకు హెచ్‌డీపీఎస్, 8 ఎకరాలకు క్లోజ్ స్పేసింగ్, 2 ఎకరాలకు ఐసీఎం పద్ధతిలో పత్తి విత్తనాలు 100 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో మండల వ్యవసాయ కార్యాలయంలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (AEO)ని సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

## విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**వెల్దండ, జూలై 08(జనంసాక్షి):** విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని వెల్దండ మండల విద్యాశాఖ అధికారి చంద్రుడు అన్నారు . బుధవారం మండల రీసోర్స్ కేంద్రంలో జరిగిన మండల విద్యాశాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రతి పాఠశాలలో విద్యార్థుల యొక్క నమోదు వంద శాతం చేయాలని, ఆధార్ ,బయోమెట్రిక్ అప్డేట్స్ ప్రతి విద్యార్థికి పూర్తి చేయాలని, ఎ.ఫ.ఆర్.స్ లో విద్యార్థుల హాజరు మరియు ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా పాఠశాల పనివేళల్లో పాటించాల్సిన నియమనిబంధనలు ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఖచ్చితంగా అన్ని పాఠశాలల్లో పాటించాలని ఉదయం 9:00 వరకు ఎఫ్.ఆర్.ఎస్ నందు మరియు రిజిస్టర్ నందు ఉపాధ్యాయుల హాజరు నమోదు చేసుకోవాలని, లీవ్ పెట్టిన ఉపాధ్యాయుల వివరాలన్నీ కూడా అప్రూవల్ చేయాలని,అదే రకంగా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ రాయలని ఆదేశించారు.ఈ సమావేశంలో మండల విద్యాశాఖ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మరియు ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలి

**- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరుణం పరిణీత**



**నర్సాపూర్, జూలై 8 (జనంసాక్షి):** దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేస్తూ, క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరుణం పరిణీత పిలుపునిచ్చారు.బుధవారం నర్సాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ బలోపేతంలో బూత్‌స్థాయి కమిటీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నిర్దిష్ట కార్యాచరణతో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, బూత్‌స్థాయి నాయకుల నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు అందరూ సమన్వయంతో పనిచేస్తే పార్టీ మరింత బలపడుతుందని ఆమె సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, రమేష్ గౌడ్, నారాయణరెడ్డి, అశోక్, ఆంజనేయులు గౌడ్, విజయ్, జ్ఞానిసింగ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మండలంలో 18.20 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాటడం..

**- ప్రభుత్వ సబ్సిడీలతో రైతులకు ప్రోత్సాహం**
**- మండల వ్యవసాయ అధికారి దీపిక**



**నర్సాపూర్, జూలై 8 (జనంసాక్షి):** నర్సాపూర్ మండలంలోని నర్సాపూర్ గ్రామంలో సూరారం నర్సింలు గారి 10 ఎకరాల్లో, రుస్తుంపేట్ గ్రామంలో పి.భిక్షపతి గారి 8.20 ఎకరాల్లో మొత్తం 18.20 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. బుధవారం ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దీపిక మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోందని, రూ.200 విలువైన ఆయిల్ పామ్ మొక్కలను రైతులకు కేవలం రూ.20కే అందజేస్తున్నారు. అలాగే డ్రిప్ సేద్యానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, సాధారణ రైతులకు 90 శాతం వరకు సబ్సిడీ కల్పిస్తున్నారు.రైతు భరోసాతో పాటు ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అంతర పంటల కోసం ఎకరానికి రూ.2,100, ఎరువుల కోసం మరో రూ.2,100 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్, లీవ్ ఫామ్ రిసోర్సెస్ కంపెనీ టెక్నికల్ పర్సన్లు అజయ్, శ్రీధర్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో బీఎల్ఓలకు ఆర్డీఓ అవగాహన సదస్సు





**కోహీర్, జూలై 8 (జనంసాక్షి):** కోహీర్ మండల రైతు వేదికలో బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) ఆర్డీఓ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్లు, చిరునామాల మార్పులు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు తదితర అంశాలపై బీఎల్ఓలకు ఆర్డీఓ దేవుజ వివరించారు. ఓటరు జాబితాను పారదర్శకంగా, తప్పులు లేకుండా సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధిత అధికారులు, ఆర్డీఓ దేవుజ, తహసిల్దార్ సుప్రియ, డిప్యూటీ తహసిల్దార్ యాసిన్ ఖాన్, ఆర్ఐ అశ్విన్ కుమార్, జిపిఓ నాగరాజ్, బీఎల్ఓలు పాల్గొన్నారు. బీఎల్ఓలకు సంగమేశ్వర్ గణన ఫామ్‌లు స్కాన్ చేయడం మరియు యాప్‌ని స్పష్టంగా వివరించారు. బిఎల్‌వోలకు ఆర్డీఓ చేతుల మీదుగా పవర్ బ్యాంకు, ఫైల్, రైన్ కోట్ అందజేశారు.

## ఉచిత పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలి

**- పశు వైద్యాధికారి డాక్టర్ పాండియన్**
**- 160 పశువులకు చికిత్సలు**



**రాయికోడు, జూలై 8, (జనంసాక్షి):** పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణకు గ్రామ గ్రామాన ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ పాండియన్ స్పష్టం చేశారు.బుధవారం మండల పరిధిలోని యూసుపూర్,తదితర గ్రామాలలో ఆవులు, ఎద్దు,లేగదూడలకు, ముద్ద చర్మ వ్యాధి నివారణ కొరకు ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు.యూసుపూర్ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల సంగారెడ్డి ఆధ్వర్యంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాండియన్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో మొత్తం నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని ఈనెల 15 వరకు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం ఎద్దు ఆవులు లేగ దూడలు కలిపి మొత్తం 3వేల వరకు ఉన్నాయని, మొత్తం రెండువేల రెండు వందలు గేదెలు ఉన్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో 160 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూసుపూరు సర్పంచ్ సంగారెడ్డితో పాటు సిబ్బంది దేవదాస్, గన్ని, పలువురు గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో హిందీ సబ్జెక్టు బోధించే గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయులు కావలెను

**అమరచింత, (జనంసాక్షి):** మండలంలోని పామిరెడ్డి పల్లె గ్రామంలో హిందీ సబ్జెక్టు బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ గా పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు తేదీ 8.7.2026 నుండి 10 జులై 2026 వరకు అప్లికేషన్స్ కేజీబీవీ పాఠశాల యందు ఇవ్వగలరు వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు 8919246424 సంప్రదించగలరు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పూరు గుడిసె లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి పత్రాలు

**- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**పెబ్బేరు, జూలై 8 (జనంసాక్షి):** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని పూరు గుడిసెలో నివసించే 45 మందిని గుర్తించారు. బుధవారం నాలుగో వార్డ్‌కు చెందిన 7 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి పత్రాలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని సహాయాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు జములమ్మ, భాగ్యలక్ష్మి శివ, మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, దాసరి రాముడు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా వార్డు సభ్యుల ఫోరం జిల్లా ఇన్చార్జిగా ముక్క అనిల్



**నంగునూర్, జులై 8 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా వార్డు సభ్యుల ఫోరం జిల్లా ఇన్చార్జిగా రాజగోపాల్ పేట గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ముక్క అనిల్ ని తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నాగబెల్లి జ్యోతి ప్రకటించారు. ఈ సమావేశంలో ముక్క అనిల్ మాట్లాడుతూ వార్డు సభ్యుల ఫోరం జిల్లా ఇన్చార్జిగా నాకు అవకాశం కల్పించిన తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నాపై వచ్చిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డు సభ్యులకు అండగా ఉంటానని వార్డు సభ్యుల సమస్యలను ప్రభుత్వానికి తెలిసే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

## శివాజీ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి**

**- శివాజీ చౌరస్తాలో హిందూ వాహిని ధర్నా**



**వనపర్తి బ్యూరో, జూలై 8 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ధ్వంసం ఘటనను ఖండిస్తూ హిందూ వాహిని ఆధ్వర్యంలో బుధవారం శివాజీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే కొత్త ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పునఃప్రతిష్ఠ నిర్వహించాలని కోరారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా సందర్భంగా పోలీసులతో ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని కార్యకర్తలు, నాయకులు, స్థానికులు పాల్గొని శివాజీ మహారాజ్‌కు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హిందు వాహిని నాయకులు శివచరణ్, విశ్వహిందూ పరిషత్ హర్షవర్ధన్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ అధికార ప్రతినిధి నక్క మహేష్ హిందు వాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొల్చారం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీ....

**- సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి**

**- రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా కొనసాగించాలి**

**- సీసీ కెమెరాల ఏర్పాటు, బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలి**

**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు**



**కొల్చారం, జులై 08(జనంసాక్షి):** బుధవారం కొల్చారం పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి, పోలీసు సిబ్బంది కిట్‌ను పరిశీలించారు. కిట్ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళా కానిస్టేబుల్ శ్రీలేఖను రివార్డుతో అభినందించారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు, స్టేషన్ డైరీలు, రౌడీ, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్, ఈ–సాక్ష్య నమోదు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లలో పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన, పారదర్శకమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సూచించారు. వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని చెప్పారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమ గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విధుల నిర్వహణతో పాటు సిబ్బంది వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడికి రూ.1.20 కోట్ల సీఎస్ఆర్ చేయూత

**- గుమ్మడిదల జెడ్పీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం**

**- నిర్మాణ పనులను పరిశీలించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**



**గుమ్మడిదల, జూలై 8(జనంసాక్షి):** గుమ్మడిదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.1.20 కోట్లతో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి చొరవతో మిత్రుడి ఎన్‌సీసీ సంస్థ నుంచి ఈ నిధులు సమీకరించగా, మొదటి విడతలో రూ.80 లక్షలు, రెండో విడతలో రూ.40 లక్షలు మంజూరయ్యాయి. గురువారం చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పాఠశాలను సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. సీఎస్ఆర్ నిధులను సమీకరించి ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి..

**- అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

**- పిహెచ్‌సిలో ఓపి సేవలు పెంచాలి**

**- సిద్దిపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్**



**నంగునూరు, జూలై 8(జనంసాక్షి):** సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించి అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ఆదేశించారు. బుధవారం నంగునూరు మండలంలోని రాజగోపాలపేట, గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి సేవలను పెంచాలన్నారు. అసంక్రమిత వ్యాధులను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు మధుమేహం, బీపీ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలన్నారు. గర్భవతులకు, చిన్నారులకు టీకాల కార్యక్రమం 100శాతం పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా స్థానిక వైద్యులు చూడాలన్నారు. ఔషధ నిల్వలను తగినస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు.

వ్యక్తిగత , పరిసరాల శుభ్రత పై తరచూ ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాలను వైద్య సిబ్బంది సందర్శించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ పేదలకు నిరంతరం వైద్యం అందేలా చూడాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రాజగోపాలపేట పిహెచ్‌సికి వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి ఇక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. గట్ల మల్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని అక్కడి వైద్యులను ఆదేశించారు. స్థానిక ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వైద్య అధికారి డాక్టర్ విపిన్, డాక్టర్ శివకుమార్ డాక్టర్ ఉదయ్ కుమార్ లను అడిగి తెలుసుకున్నారు.

# ఫిల్టర్ ఇసుక అక్రమాలపై ఉక్కుపాదం

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 8 (జనంసాక్షి):** జిల్లాలో ఫిల్టర్ ఇసుక కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అక్రమాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వొద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫిల్టర్ ఇసుక యూనిట్లు ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలు, భూగర్భ జలాల సంరక్షణ చట్టాలకు అనుగుణంగా నిర్వహించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనుమతులు లేని యూనిట్లు, అక్రమ ఇసుక నిల్వలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కార్యకలాపాలను వెంటనే గుర్తించి అడ్డుకోవాలని, సంబంధిత వాహనాలను సీజ్ చేసి అవసరమైతే కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, సంగారెడ్డి, జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో 'పెన్ బ్యాంక్' ప్రారంభం




**నంగునూరు, జులై 8 (జనంసాక్షి):** నంగునూరు మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 'పెన్ బ్యాంక్'ను ప్రారంభించారు. దాత వంటేల జీవన్ రెడ్డి, పాఠశాల విద్యార్థులందరికీ పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థికి పెన్ అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఇది వారికి జ్ఞానాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుంది. ఈ ఆయుధాన్ని సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి అని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్ యాదవ్, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంతో రాజీ లేదు.. హోటళ్లు, రెస్టారెంట్లలో నిబంధనలు తప్పనిసరి

**- ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్‌రావు**





**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 8 (జనంసాక్షి):** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ స్పష్టం చేశారు. బుధవారం మెదక్ పట్టణంలోని పలు హోటళ్లు, ఫుడ్ రెస్టారెంట్లలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాగత్, చంద్రభవన్, ప్యారడైజ్‌తో పాటు మరికొన్ని హోటళ్లలో వంటశాలలు, నిల్వ గదులు, పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, సిబ్బంది పరిశుభ్రత, కిచెన్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ, మెదక్‌లోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు అయ్యేలా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వారానికోసారి తనిఖీలు చేపట్టి నివేదిక సమర్పించాలని, నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లు, రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటల్ యజమానులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలు నమ్మకంతో ఆహారం తీసుకుంటున్నందున నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం వారి బాధ్యత అని అన్నారు. కల్తీ లేదా నాసిరకం ఆహారాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే స్వయంగా హోటళ్లలో తనిఖీలు నిర్వహించడాన్ని స్థానికులు స్వాగతించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఐఐటీ కంది బ్రిడ్జి వద్ద ట్యాంకర్ ఢీకొని యువకుడు మృతి

**- ప్రమాదంలో గాయపడ్డ తల్లి కొడుకు**

**- సంగారెడ్డి రూరల్ ఎస్పై మధుసూదన్ రెడ్డి**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 8(జనంసాక్షి):** సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐఐటీ కంది బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ సాజిద్ (28) తన తమ్ముడు రషీద్ (25), తల్లి షాహిన్ బేగం (50)తో కలిసి ఏపీ 10 ఏఏ 7365 నంబర్ గల ద్విచక్ర వాహనంపై రెడ్డి ఖానాపూర్ నుంచి సంగారెడ్డికి వస్తుండగా, ఐఐటీ కంది బ్రిడ్జి వద్ద వెనుక నుంచి వచ్చిన ఏపీ 23 ఎక్స్ 4479 నంబర్ గల ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాజిద్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రషీద్‌కు తల, ఛాతీ, కాళ్లు, నడుము భాగాల్లో గాయాలు కాగా, షాహిన్ బేగంకు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మహ్మద్ ఇబ్రహీం ఫిర్యాదు మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రైతు భరోసా నిధుల విడుదలకు స్వాగతంగా ఘన పాలాభిషేకం



**మహబూబ్‌నగర్ రూరల్, జులై 08 (జనంసాక్షి):** టీపీసీసీ ఆదేశాల మేరకు, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుఎ. సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, రైతు సంఘం నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించి, రైతు భరోసా నిధుల విడుదలను స్వాగతిస్తూ విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుఎ. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద అత్యంత వేగంగా నిధులను విడుదల చేస్తోంది. కేవలం వారం రోజుల్లోనే రూ.7,750 కోట్లకు పైగా నిధులు విడుదల చేసి, రాష్ట్రవ్యాప్తంగా 68.96 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించింది. దీంతో 129.17 లక్షల ఎకరాల సాగు భూమికి ఆర్థిక భరోసా కల్పించబడింది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో దళారుల ప్రమేయం లేకుండా, లీకేజీలకు తావులేకుండా, నూతన రెవెన్యూ వెరిఫికేషన్ వ్యవస్థ ద్వారా నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. జూన్ 30న ప్రారంభమైన ఈ ప్రక్రియలో చిన్న, సన్నకారు రైతులకే తొలి ప్రాధాన్యత కల్పించారు. 1, 2 ఎకరాల నుంచి ప్రారంభించి ఐదో రోజు నాటికి 5 ఎకరాల లోపు ఉన్న రైతులందరికీ నిధులు పూర్తిగా జమ చేశారు. తాజాగా ప్రభుత్వం 7వ విడత నిధులుగా, 7 నుంచి 8 ఎకరాల లోపు భూమి ఉన్న 58,831 మంది రైతులకు రూ.259.73 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే 7 ఎకరాల లోపు ఉన్న రైతులందరికీ నిధులు అందగా, మిగిలిన అర్హులైన రైతులకు కూడా త్వరలోనే పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పునర్వ్యవస్థీకరించిన మార్గదర్శకాల ప్రకారం రైతులకు ప్రతి సీజన్‌కు ఎకరానికి రూ.6,000 చొప్పున (ఏడాదికి రూ.12,000) పెట్టుబడి సాయం అందజేస్తోంది. అదేవిధంగా రూ.5 లక్షల రైతు బీమా మరియు వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అండగా నిలుస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సాగులో ఉన్న భూములకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తూ, రియల్ ఎస్టేట్ ప్లాట్లు, సాగుకు అనర్హమైన భూములను మినహాయించి, నిజమైన అర్హులైన రైతులకే ఈ లబ్ధి అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం విశేషం.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బెక్కరి అనితా రెడ్డి,మీడియా సెల్ సీజే బెనర్,డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ జనరల్ సెక్రటరీ రాములు యాదవ్, దోమ పరమేశ్, హన్వాడ మండల అధ్యక్షుడు మహేందర్, జిల్లా మత్స్య శాఖ సంఘం అధ్యక్షుడు గొనేల శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల రాజు, డీసీసీ కమిటీ సభ్యులు రమేష్ శెట్టి, పులిజాల రవికిరణ్, ఉషారాణి, సేవాదళ్ అబూకర్, వెంకట్ లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్, చందు యాదవ్, రాజేష్ ముదిరాజ్.జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి హరీష్, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు విగ్రహ ప్రతిష్ట హోమములు



**మల్దకల్, జూలై8(జనంసాక్షి):** మండల పరిధిలోని నేతి వానీపల్లె గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయములో శ్రీ ఆంజనేయ,వినాయక, శివ పార్వతిదేవి,నందీశ్వర, నవగ్రహ,నాగదేవతా,వాల్మీకి, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవములు రెండవ రోజు బుధవారం నిర్వహించారు.ప్రాతఃకాలపూజ,నూతన మంత్ర విగ్రహములకు రుద్రాభిషేకం, ధాన్యాదివాసం, పవమాన హోమం, శ్రీ పురుషామన్య, నవగ్రహ, దీక్ష హోమము మంగళహారతి, తీర్థప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం పునఃపూజ రుద్ర హోమం,విగ్రహ సంస్కారములు న్యాస విధానం,రాజోపచారములు, శయ్యాధివాసం,మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణనిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, ప్రాణేష్,శశాంకదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డికి మా ఘన నివాళులు




**మహబూబ్‌నగర్ రూరల్, జులై 08 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు ఏ. సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి చిత్రపటానికి డీసీసీ అధ్యక్షులు ఏ. సంజీవ్ ముదిరాజ్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బెక్కరి అనితా రెడ్డి,మీడియా సెల్ సీజే బెనర్,డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ జనరల్ సెక్రటరీ రాములు యాదవ్, దోమ పరమేశ్, హన్వాడ మండల అధ్యక్షుడు మహేందర్, జిల్లా మత్స్య శాఖ సంఘం అధ్యక్షుడు గొనేల శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల రాజు, డీసీసీ కమిటీ సభ్యులు రమేష్ శెట్టి, పులిజాల రవికిరణ్, ఉషారాణి, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగిపోయిన ఇసుక సరఫరా ఇసుక వాహనదారుల ఆందోళన



**కొత్తపల్లి, జూలై 8 (జనంసాక్షి):** కొత్తపల్లి మండల పరిధిలోని లింగల్ చేడ్ గ్రామ శివారులోని పెద్ద వాగు నుంచి ప్రభుత్వం ఇసుక రవాణా కొనసాగిస్తుంది. బుధవారం రోజు టోకెన్ మరియు ఆన్లైన్ ద్వారా రవాణా జరుగుతుందని సమాచారం మేరకు ఇసుక వాహనదారులు ట్రాక్టర్ లోడ్ చేసుకున్న తర్వాత ఆన్లైన్ ఇసుక మాత్రమే సరఫరా జరుగుతుంది అన్ని ఎస్ఆర్ఓ తెలిపారు.ఇసుక ట్రాక్టర్లు అక్కడి నుంచి కదలకుండా సాయంత్రం వరకు నిల్చిపోవడం జరిగింది. ఆన్లైన్ ఇసుక సరఫరా సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి ఉంటుంది. ఇక్కడ మాత్రం ఉదయం నుంచి ఇసుక సరఫరా చేయకుండా సాయంత్రం 4 గంటల 45నిమిషాలకు ఇసుక సరఫరా కొనసాగించారు. సాయంత్రం 5 గంటలు దాటినా తర్వాత ఇసుక సరఫరా చేస్తే అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం టోకెన్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం ఇచ్చిన అధికారులు ఇసుక ట్రాక్టర్ లు పంపియకపోవడంతో, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు ఇసుక లోడ్ తో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటలు దాటి పడిగాపులు కాస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఘనంగా మహానేత వైయస్సార్ జయంతి వేడుకలు




**వెల్దండ, జూలై 08 (జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మరుపురాని మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జన్మదిన వేడుకలు బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు హరి కిషన్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేసి సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సీనియర్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, ఉపసర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, నారాయణ నాయక్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, తిరుపతి రెడ్డి, హామీద్, ఎండి రషీద్, వార్డు సభ్యులు పురుషోత్తం చారి, ముదిగొండ రమేష్, మసిగుండ్ల వెంకటేష్, కుందారం తండా సర్పంచ్ గన్యా నాయక్, గజిని శ్రీను, ఈదులపల్లి శ్రీనివాస్, పలువురు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలు నాణ్యత గల వస్తువులు సరఫరా చేయాలి

**- అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 8 (జనంసాక్షి):** టెండర్‌లో కోడ్ చేసిన అంతే నాణ్యత గల వస్తువులు సరఫరాకు ఏజెన్సీలు నిబంధనలు తప్పక పాటించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో గతంలో ఇచ్చిన ప్రకటన ఆధారంగా గిరిజన సంక్షేమ , గురుకుల పాఠశాలలు కళాశాలలో మరియు హాస్టళ్లలో నాణ్యమైన కూరగాయలు, కోడిగుడ్ల సరఫరా కోసం అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో టెండర్ల కమిటీ ఆధ్వర్యంలో కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్, సరఫరాకు పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ అర్హులైన సరఫరాదారులు/ ఏజెన్సీలను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు సేవా దృక్పథంతో టెండర్లలో కోడ్ చేసిన నిబంధనల మేరకు అంతే నాణ్యత గల కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్ అందించాలన్నారు. నిబంధనలను పాటించని ఏజెన్సీ లపై కఠిన చర్యలు తీసుకుంటామని భవిష్యత్తులో టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ టెండర్ల ప్రక్రియ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, గిరిజన సంక్షేమ వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ



**కోహెడ, జూలై 08 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కోహెడ మండలానికి మంజూరు అయిన కళ్యాణ లక్ష్మీ చెక్కులను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయినీ నిర్మల - జయరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్, తహశీల్దార్ నవీన్ కుమార్, మండల అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పేదింటి ఆడపిల్లలకు ఇచ్చే కళ్యాణ లక్ష్మీ ఒక వరం అని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల పార్టీ అని పలువురు నాయకులు అన్నారు. ఈ సందర్భంగా చెక్కులు మంజూరు చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బందేల సుజాత -బాలకిషన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కాంతాల శివారెడ్డి, కాచాపూర్ సర్పంచ్ రాయనబోయిన లత - శ్రీనివాస్, ఉప సర్పంచ్ జేరిపోతుల శ్రీనివాస్ , పార్టీ నాయకులు,కూరేళ్ళ గ్రామ సర్పంచ్ బండారి లక్ష్మి - బాలరాజు, వివిధ గ్రామాల సర్పంచ్ లు,నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణను ప్రతి ఒక్కరు పాల్గొన్న వలసినది

**- సూచనలు సలహాలు ఇస్తున్న మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్**

**మెదక్, జూలై 08, (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నింపాలని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ప్రజలకు సూచించారు. మెదక్ పట్టణంలోని ఆజంపుర ప్రాంతంలో 9వ, 26వ వార్డులకు సంబంధించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నరేష్ గౌడ్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఒకే వ్యక్తి పేరు రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒకే చోట ఉండేలా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా నింపాలని తెలిపారు. ఫారాల నింపడంలో లేదా ఓటరు జాబితాకు



సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత బీఎల్డీవోలను సంప్రదించాలని, అవసరమైతే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ తాహెర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ ఫాజిల్, మహ్మద్ అంజద్, సయ్యద్ ఒమర్ మొహియుద్దీన్త తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్ వద్ద తుంగభద్ర జలాల దోపిడీ

**- అక్రమ ప్రాజెక్టులను వెంటనే ఆపాలని మాజీ మంత్రుల డిమాండ్**



**జడ్చర్ల, జూలై 8 (జనంసాక్షి):** కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తుంగభద్ర నదిపై చేపట్టిన అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణ నీటి వాటాకు తీవ్ర విఘాతం కలుగుతోందని మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్)ను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీరితో పాటు మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాలు చేపట్టిన అక్రమ నిర్మాణాలతో ఆర్డీఎస్ ఆయకట్టు ఎడారిగా మారుతోందని, చుక్క నీరు కూడా దిగువకు రాని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ గారు పాదయాత్ర చేసి ఆర్డీఎస్ రైతుల కష్టాలను తెలుసుకున్నారని, ఇచ్చిన మాట ప్రకారం తుమ్మిళ్ళ లిఫ్ట్ ప్రాజెక్టును పూర్తి చేశామని గుర్తు చేశారు. తుంగభద్ర జలాల దోపిడీని చూస్తూ రాష్ట్ర ప్రభుత్వం కళ్లు మూసుకొని కూర్చుందని, మహబూబ్ నగర్ జిల్లా హక్కులను తాకట్టు పెడుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే మంత్రుల బృందాన్ని అక్కడికి పంపి, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, తెలంగాణ నీటి వాటా కోల్పోతుంటే చూస్తూ ఊరుకునేది లేదని, భవిష్యత్తులోనూ రాష్ట్ర ప్రయోజనాల కోసం, మహబూబ్ నగర్ హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఓటర్ల జాబితా లోపాలు లేకుండా పారదర్శకంగా ఉండాలి

**- అదనపు కలెక్టర్ హరిప్రియ**



**జడ్చర్ల, జూలై 8 (జనంసాక్షి):** ఓటర్ల జాబితాను అత్యంత ఖచ్చితంగా, సమగ్రంగా ఎటువంటి లోపాలు లేకుండా రూపొందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఎన్నికల నమోదు అధికారి హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయంలో 75-జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 కార్యక్రమాలపై ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూనే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సహాయ ఎన్నికల నమోదు అధికారులను ఆదేశించారు. పారదర్శకమైన, నిష్పక్షపాతమైన ఓటర్ల జాబితా తయారీకి అధికారులు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని, ఓటర్లు తమ వివరాలను డిజిటలైజేషన్ చేసుకునేలా ప్రోత్సహించాలని, అందుకు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సంబంధిత బూత్ స్థాయి అధికారులకు అందజేయడంలో చొరవ చూపాలని కోరారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, సూచనలు ఏవైనా ఉంటే నిర్దేశించిన సమయాల్లో సమర్పించి, ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావు, మున్సిపల్ కమిషనర్ గిరీష్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ అలీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ.4కోట్ల నిధులతో సంగారెడ్డి మున్సిపాలిటీలో సిసి రోడ్ పనులను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

- రూ.1.40 కోట్లతో 11వ వార్డు శిల్పా వెంచర్‌లో సిసి రోడ్
- రూ.1.60 కోట్లతో 33వ వార్డులో సిసి రోడ్
- రూ.1కోట్లతో 28వ వార్డులో సిసి రోడ్



**సంగారెడ్డి, జులై 08 (జనంసాక్షి):** సంగారెడ్డి మున్సిపాలిటీలో రూ. 4కోట్లతో చేపట్టిన సిసి రోడ్ పనులను టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి బుధవారం ప్రారంభించారు. 11వ వార్డులోని శిల్పా వెంచర్ సిసి రోడ్ పనులను ప్రారంభించారు. అనంతరం 33 వ వార్డు, 28 వార్డుల్లో సిసి రోడ్ పనులను సైతం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ జగ్గారెడ్డి సహకారంతో సంగారెడ్డి మున్సిపాలిటీలో పనులు ప్రారంభమవుతున్నాయని, రానున్న కాలంలో మరిన్ని నిధులతో సంగారెడ్డిలో ప్రతీ వార్డ్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నరు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డి ఈ రఘు రాథోడ్, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, నాయకులు కూన సంతోష్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు మహేష్, రవి నాయక్, తులసి రామ్, దశరథ్ రెడ్డి, శైలేష్ రెడ్డి, శ్రీశైలం, సతీశ్ రెడ్డి, నవాజ్, అశ్విన్, కో ఆప్షన్ సభ్యులు బబ్బు, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కన్నతల్లి హత్య... కుమారుడికి జీవిత ఖైదు

- రూ.5 వేల జరిమానా విధించిన జిల్లా కోర్టు..
- కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన ఎస్పీ

**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 8 (జనంసాక్షి):** మద్యం మత్తులో కన్నతల్లిని హత్య చేసిన కేసులో కుమార్ రెడ్డికి జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు... టేక్మాల్ మండలం ఎల్పుగొండ గ్రామానికి చెందిన మోహన్ గారి సుదర్శన్ మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో, ఆమెను తిరిగి తీసుకురావాలని తన తల్లి సత్యమ్మతో తరచూ వివాదానికి దిగేవాడు. డబ్బుల కోసం కూడా తల్లిని వేధించేవాడు. ఈ క్రమంలో 2025 నవంబర్ 8 అర్ధరాత్రి మద్యం మత్తులో తల్లితో జరిగిన గొడవలో కర్రతో తలపై బలంగా దాడి చేయడంతో సత్యమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం అల్లాదుర్గ్ సీఐ రేణుక శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి దర్యాప్తు పూర్తిచేసి నిందితుడిపై చార్జి షీట్ దాఖలు చేశారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు మోహన్ గారి సుదర్శన్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్,




కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ కృష్ణ సమన్వయంతో పనిచేశారు. తక్కువ సమయంలో దర్యాప్తు పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు లైజన్ అధికారులు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అభినందించారు.

## అగర్వాల్ ఫౌండ్రీస్ విస్తరణ నిలిపివేయాలి : బీఆర్ఎస్ నేతల డిమాండ్



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 8 (జనంసాక్షి):** మెదక్ జిల్లాలోని రంగాయపల్లి, చెట్ల గౌరారం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఎం ఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విస్తరణను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కంపెనీ విస్తరణను వ్యతిరేకిస్తూ రంగాయపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలు నిరసనలు, ధర్నాలు నిర్వహించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా స్థానికులు శ్వాసకోశ, చర్మ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, గాలి, ధూళి, భూగర్భ జలాలు కలుషితమవడంతో వ్యవసాయ భూములు దెబ్బతిని పంట దిగుబడులు తగ్గిపోయాయని పేర్కొన్నారు.

కంపెనీ విస్తరణకు సంబంధించి గతంలో నిర్వహించిన రెండు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించడం వల్ల ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేయలేకపోయారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కంపెనీ విస్తరణకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, కాలుష్య సమస్యపై స్వతంత్ర నిపుణులతో సమగ్ర విచారణ చేపట్టాలని, ప్రజల ఆరోగ్యం, వ్యవసాయాన్ని పరిరక్షించే చర్యలు తీసుకోవాలని కోరారు.

అవసరమైతే స్వేచ్ఛాయుత వాతావరణంలో మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రంగాయపల్లి, చెట్ల గౌరారం గ్రామాల బాధితులు వినతిపత్రంపై సంతకాలు చేసి అధికారుల జోక్యాన్ని కోరుతున్నారని తెలిపారు. రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



**వెల్దండ, జూలై 08(జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంలో రైతు భరోసా నిధులు జమ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరి కిషన్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు భూపతిరెడ్డి, డీసీసీ కార్యదర్శి మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతని ఇస్తుందని పేర్కొన్నారు. రైతు భరోసా నిధులు వానాకాలం పంటల పెట్టుబడి సాగుకింద దాదాపు రూ.9వేల కోట్ల నిధులను దశలవారీగా రైతుల ఖాతాలో జమ చేయడం అన్నదాతలు హర్షించదగ్గ శుభ పరిణామం అని అన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ రైతులకిచ్చిన ప్రతీహామీని కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తుందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్,ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్,జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, సర్పంచులు గన్యా నాయక్, శ్రీను నాయక్,మమత లక్ష్మణ స్వామి, వార్డు సభ్యులు గుద్దేటి కిష్టాల్, ముదిగొండ రమేష్,వాణి పురుషోత్తం చారి, సీనియర్ నాయకులు చిమ్ముల తిరుపతిరెడ్డి, కృష్ణ ముదిరాజ్,ఎండీ రషీద్,ప్రశాంత్, నాగరాజు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నైపుణ్యాల అభివృద్ధితోనే నాణ్యమైన విద్య సాధ్యం

**- ఏఎంఓ విద్యాసాగర్**



**నారాయణపేట, జూలై 8(జనంసాక్షి):** ఉపాధ్యాయుల నైపుణ్యంతోనే నాణ్యమైన విద్య సాధ్యమని ఏ ఎం ఓ విద్యాసాగర్ అన్నారు. పాఠశాల విద్యాశాఖ –సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలో నిర్వహిస్తున్న 3 రోజుల జిల్లా స్థాయి సమీకృత ఇన్–సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం బుధవారం జడ్పీహెచ్ఎస్ జాజాపూర్లో ఘనంగా ప్రారంభమైంది.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని కోర్సు కోఆర్డినేటర్ ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్ర కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపా ధ్యాయురాలు శ్రీమతి భారతి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంఓ విద్యాసాగర్ మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణ ద్వారా పొందిన నూతన బోధనా పద్ధతులను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థిలో నేర్చుకునే ఆసక్తి, ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నిబద్ధత, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి నిజమైన శిల్పులని పేర్కొన్నారు. సీఎంఓ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ, నేటి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను నవీకరించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో ఆచరణలో పెట్టినప్పుడే శిక్షణ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని పేర్కొన్నారు. డీఎస్ఓ భానుప్రకాశ్ శిక్షణ కార్యక్రమం లక్ష్యాలు, నిర్వహణ విధానం గురించి వివరించగా, ప్రధానోపాధ్యాయురాలు భారతి శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి, కార్యక్రమం విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణలో హిందీ సబ్జెక్టుకు చెందిన 60 మంది ఉపాధ్యాయులు, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుకు చెందిన 90 మంది ఉపాధ్యాయులు, మొత్తం 150 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా మధ్యాహ్న భోజన సమన్వయకర్త యాదయ్య శెట్టి, రిసోర్స్ పర్సన్లు రాకేష్,శంకర్ తిరుమల్, మిస్కిన్ శ్రీనివాస్, యాదమ్మ, సంతోష్ కుమార్, శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, జైపాల్ రెడ్డి పాల్గొని శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో తమ సేవలను అందించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యతను మరింత మెరుగుపరచడం, విద్యార్థుల అభ్యాస ఫలితాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**గుండుమాల్, జూలై 8(జనంసాక్షి):** గుండుమాల్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం నిధులు విడుదల చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాన కాలం రైతు భరోసా పథకం ద్వారా రైతులకు 9రోజులోనే తెలంగాణ రైతులకు రైతు పెట్టుబడి సాయాన్ని అందించన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అదే విధంగా నూతనంగా ఎన్నికైన డిసిసి ఉప అధ్యక్షులు ఎస్ సురేష్ రెడ్డి ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు తమ హోదాను మరిచి పార్టీ కార్యకర్తగా పని చేయాలని ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా కృషి చేయాలని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ చైర్మన్ వెంకటయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీశైల నర్సింహ, గుండుమాల్ మండల గ్రామ సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టాలి : జిల్లా ఎస్పీ డాక్టర్.వినీత్



నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 8(జనంసాక్షి):జిల్లాలో నమోదు అవుతున్నా అయా కేసులలో అధికారులు పకడ్బందీగా పారదర్శకంగా విచారణ చేపట్టాలని, అందుకు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ను పెంపొందించుకోవాలని, ప్రతి కేసును లోతుగా విచారణ చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ అధికారులకు తెలియజేశారు. బుధవారం రోజు జిల్లా పోలీసు అధికారులు డీఎస్పీలు, సీఐలు,అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ముందుగా జిల్లాలోని అన్ని పోలీస్టేషన్లలో లాంగ్ పెండింగులో ఉన్న కేసుల వివరాలను, యుఐ కేసులను అడిగి పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని, ప్రాపర్టీ నేరాలను లోతుగా విచారణ చేపట్టి నేరస్తులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని, మహిళా, బాలికల నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముందస్తు నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో బాధితులకు మరింత సౌకర్యం కల్పించడం కోసం ఇంటి వద్దకు వెళ్లి ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలి అని సూచించారు.తమ పరిదిలో జరిగే నేరాలలో పకడ్బందీగా విచారణ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి భాధితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి కేసు విచారణలో ప్లాన్ ఆఫ్ యాక్షన్ చేసుకొని పకడ్బందీగా విచారణ చేపట్టాలని, పార్ట్-1,పార్ట్-2 స్టేట్మెంట్ రికార్డ్ సి డి ఎఫ్ ఫీల్ చేయుట, పోటోస్, ప్రాపర్టీ సీజ్, నిందితుల వివరాలు ఎంట్రీ చేయుట, రిమాండ్ డైరీ చార్జి షీట్ ఫీల్ చేయుట తదితర అంశాల పై ఆయా కేసులలో ఫైల్‌లను పరిశీలించి ఎస్‌హెచ్‌ఓలకు తగు సూచనలు చేశారు. రోడ్డు భద్రత నియమాలు, రోడ్డు సేఫ్టీ గురించి విస్తృతంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహనా కల్పించాలని అన్నారు. ఎస్సైలు తప్పని సరిగా గ్రామాలను సందర్శించాలని, ప్రతిరోజు రోల్‌కాల్ ఏర్పాటు చేసి విధుల గురించి తెలపాలని, ప్రతి నెల చీఫ్ ఆఫీస్‌కు పంపే రిపోర్ట్స్ సమయానికి పంపాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరిరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న పండగలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పరిధిలో ఉన్న రౌడీ షీటర్ లను, కమ్యునల్ షీటర్స్‌నీ బైండోవర్ చేయాలని తెలిపారు. నూతన అప్లికేషన్స్‌పై అవగాహన కల్గిఉండాలని ప్రాపర్టీ నేరాలపై నిఘా ఉంచి దృష్టి సాధించాలని అన్నారు. నేరాల నియంత్రణ చేదనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సిఐలు రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, నరేష్, రమేష్, భాగ్య లక్ష్మీ రెడ్డి, అశోక్ బాబు, నవీద్, విజయ్ భాస్కర్, పురుషోత్తం, శ్రీనివాసులు, సునీత, గాయత్రి, మహేశ్వరి, స్టేషన్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

# జనంసాక్షి ఎఫెక్ట్.. కథనంతో కదిలిన యంత్రాంగం..!

- కుళ్లిన గుడ్ల వ్యవహారంపై అంగన్వాడి కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
- మరోసారి నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు
- జిల్లా అధికారి సీడీపీఓ రాధిక సూపర్వైజర్ పద్మ,అంగన్వాడి సిబ్బందికి.హెచ్చరిక



మహమ్మదాబాద్,జూలై 8 (జనంసాక్షి): గర్భిణీలకు పంపిణీ చేయాల్సిన గుడ్లు కుళ్లిపోవడంపై అంగన్వాడి కేంద్రంలో కుళ్లిపోయిన గుడ్లు గర్భిణీలకు అందజేస్తారా అంటూ..జనంసాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు.బుధవారం మండలంలోని గాధిర్యాల్ గ్రామం-2 అంగన్వాడి కేంద్రాన్ని సూపర్వైజర్ పద్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కేంద్రంలో నిల్వఉంచిన గుడ్ల పరిస్థితిని పరిశీలించి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గ్రామంలోని గర్భిణీలతో మాట్లాడి గుడ్ల పంపిణీపై వివరాలు సేకరించారు.గర్భిణీలకు నిర్ణీత సమయంలో గుడ్లు పంపిణీ చేయకపోవడంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండి కొన్ని గుడ్లు కుళ్లిపోయినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.ఈఘటనపై సూపర్వైజర్ పద్మను,జిల్లా అధికారి సీడీపీఓ రాధిక పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.వాస్తవ పరిస్థితిపై నివేదిక కోరారు.అంగన్వాడి కేంద్రాల్లో పోషకాహార పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండకూడదని,గుడ్ల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి.మాత్రమే గర్భిణీలకు అందజేయాలని సిబ్బందికి ఆదేశించారు.ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే..బాధ్యులైన అంగన్వాడి సిబ్బందిపై కఠిన శాఖాపరమైన చర్యలు తప్పవని సీడీపీఓ రాధిక హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి మణికమ్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి,గర్భిణీలు,అంగన్వాడి టీచర్ సవిత, పాల్గొన్నారు.

# పేటలో బిజెపి కార్యవర్గం మరికొందరికి పదవులు






నారాయణపేట, జూలై 8(జనంసాక్షి): బిజెపి సంస్థాగత నిర్మాణం పార్టీ పటిష్టతలో భాగంగా నారాయణపేట పట్టణ బిజెపి కమిటీలో అదనంగా చురుకైన పార్టీ నాయకులకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ మరికొందరికి బాధ్యతలు అపగించారు. అందులో భాగంగా పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా బాబు మేస్త్రి, ఉషన్న యాదవ్, కార్యదర్శులుగా బాపునగర్ హనుమంతు, భీమ్ రాజ్‌లను కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్,కందికొండ రమేష్, పీర్లబాయి రవి, డీలర్ లక్ష్మణ్,ఈ.గిరి లను నియమించడం జరిగిందని పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్ తెలిపారు.ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోవు రోజుల్లో తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చే దిశగా అందరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క సత్యనారాయణ పాల్గొన్నారు.

# చెరువులో ఎఫ్టీఎల్ హద్దులు ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు



రాజాపూర్, జూలై8 (జనంసాక్షి): మండల పరిధిలోని రంగారెడ్డిగూడ పెద్ద చెరువు లో ఎఫ్టీఎల్ హద్దులు ఏర్పాటు చేయాలని మత్స్య సహకార సంఘం సభ్యులు తహసీల్దార్ రాధాకృష్ణ ను కోరగా, బుధవారం రోజు ఇరిగేషన్ ఏఈఈ శశిధర్ ఆధ్వర్యంలో ఫుల్ ట్యాంక్ లేవల్ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. హద్దు రాళ్ళు ఏర్పాటు చేసి రంగులు వేసి ఏర్పాటు చేయడంలో రంగారెడ్డిగూడ మత్స్య సహకార సంఘం సభ్యులు సహకారం అందించారు.

# దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీ డీకే అరుణకు వినతి



మిడ్జిల్, జూలై 8 (జనంసాక్షి): మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలో శ్రీశ్రీ కాశీ పంచలింగేశ్వర స్వామి భ్రమరాంబిక దేవి ఆవరణలో కళ్యాణ మండపం నిర్మాణానికి బుధవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామంలో నిరుపేద కుటుంబీకులు పేద పిల్లల పెండ్ల కోసం ఫంక్షన్ హాల్ లో పెళ్లిలు చేసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అలాంటి పేద వివాహల కోసం దేవాలయ ఆవరణలో కళ్యాణ మండపం మంజూరు చేసి నిర్మించినట్లయితే పేద ప్రజలు కళ్యాణాలు జరుపుకోవడానికి సానుకూలంగా ఉంటుందని ఎంపీ డీకే అరుణకు వివరించారు. ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ దేవాలయాల్లో కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేసే విధంగా ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పెద్దలు పాల్గొన్నారు.

# దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్. వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



అమరచింత, జూలై 8 (జనంసాక్షి): బుధవారం మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు రవికాంత్ ఆధ్వర్యంలో ఘనంగా దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు రాజీవ్ గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీనాయకులు మిఠాయిలు పంచిపెట్టారు అనంతరం నాయకులు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ 108 ఎన్నోసంక్షేమ పథకాలు పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఫీజు మినహాయింపు ప్రవేశపెట్టిన మాజీ ముఖ్యమంత్రిని రాజశేఖర్ రెడ్డిని కొనియాడారు. అమరచింత మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ యాదవ్ డిసిసి కార్యదర్శి రమేష్ ముదిరాజ్ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు రవికాంత్ మున్సిపల్ కౌన్సిలర్ లలితా ప్రకాశం రాములు కో ఆప్షన్ నెంబర్ తోఫిక్ మన్నెమ్మ డేవిడ్ మాజీ జెడ్పిటిసి సభ్యులు వెంకటయ్య నాగుల్ కడుమూరు గ్రామ సర్పంచ్ శివ కుమార్ ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి మహేష్ నాయక్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హనుమంతు నాయక్ ఐఎన్టియుసి మండల అధ్యక్షులు దాస్ జగన్ రెడ్డి , భగవంతు రెడ్డి బిసి రెడ్డి మోహన్ రెడ్డి కురుమూర్తి యాదవ్ మధు సురేందర్ రెడ్డి వెంకట్ రెడ్డి అంజి గౌడ్ విజయ్ రాజేశ్వరి నరసింహులు బాలరాజు రఘు వీరేష్ గౌడ్ నరేష్ యాదవ్ పాషా వినోద్ గౌడ్ రాఘవేందర్ పురుషోత్తం వివిధ గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జన హృదయ నేత వైఎస్ఆర్ జయంతి



గుండుమాల్, జూలై 8 (జనంసాక్షి): చెరిపేస్తే చెరిగి పోయే చరిత్ర కాదు, కొన్ని కోట్ల ప్రజల హృదయాలను గెలుచుకున్న మహానేతను తలచుకుంటూ, మళ్లీ ఎప్పుడు పుడతావ్ రాజన్న అంటూ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతిని పురస్కరించుకొని గుండుమాల్ శివాజీ చౌరస్తాలో వైఎస్ఆర్‌కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుండుమాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల, విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్మెంట్, పింఛన్ల మొత్తాన్ని పెంచడంలో వై ఎస్ ఆర్ ప్రవేశపెట్టిన పథకాలే ప్రజల గుండెల్లో ఆయన్ను చిరస్మరణీయున్ని చేశాయి. ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి, నేటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ చైర్మన్ బి వెంకటయ్య, గుండుమాల్ గ్రామ సర్పంచ్ శ్రీశైల నర్సింహ, గుండుమాల్ మండల గ్రామ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ సర్వే పరిశీలన చేసి జిల్లా అడిషనల్ కలెక్టర్

**మాగనూర్, జూలై 8 (జనంసాక్షి):** మాగనూరు మండలం వడ్వాట్ గ్రామంలో బుధవారం రోజు BLOలు చేస్తున్న SIR సర్వే పరిశీలనకు వచ్చిన నారాయణ పేట జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, మాగనూరు మండల తాసిల్దార్ రహిమాన్, RI సుధాకర్ రెడ్డి. ఈ సర్వేలో ఎక్కడ కూడా తప్పులు జరగకుండా ప్రతి కుటుంబం దగ్గరకు వెళ్లి ఓటర్ యొక్క సమాచారం తీసుకుని పొరపాటు జరగకుండా గణన ఫారం పూర్తి చేయాలని BLO, BLA లకు వివరించడం జరిగినది ఈ కార్యక్రమంలో రవీందర్ సర్పంచ్, GPO శ్రీనివాసులు గ్రామ స్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

**కృష్ణ, జూలై 8 (జనంసాక్షి):** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం కృష్ణ మండల కేంద్రంలోని చౌరస్తాలో కృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా నిధులు జమ చేసిన శుభసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయప్ప గౌడ మాలిపటేల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

**- సత్యనారాయణ రెడ్డి**



**జడ్చర్ల, జూలై 8 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, నిలిచిన వేతనాలను చెల్లించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 9న హైదరాబాద్‌లోని కోఠిలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని, అవసరమైతే ఆసుపత్రి సేవలను స్తంభింపజేసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య, రోగుల సంరక్షణ, భద్రతా కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, చట్ట ప్రకారం 23 సెలవులు, బోనస్, కరువు భత్యం అమలు చేయాలని కోరారు. తదుపరి టెండర్లలో ఈ అంశాలను చేర్చాలని, లేనిపక్షంలో ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు భాగి కృష్ణయ్య, ఆసుపత్రి యూనియన్ ప్రతినిధులు నరసింహ, నవీన్, మల్లేష్, రామకృష్ణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ



**గద్వాల నడిగడ్డ,జూలై 8 (జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లాలోని ర్యాలంపాడు నూతన ఆర్అర్ సెంటర్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, రాష్ట్ర క్రీడలు, యువజన సేవలు, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.

## సన్న రకం వరి విత్తనాల పంటను తప్పకుండా నమోదు చేయాలి : ఏఈవో డాకేశ్వర్ గౌడ్



**వీపనగండ్ల, జూలై 9 (జనంసాక్షి):** వీపనగండ్ల మండల పరిధిలోని సంపత్‌రావుపల్లి, సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల్లోని విత్తన డీలర్ల దుకాణాలను వ్యవసాయ విస్తరణ అధికారి డాకేశ్వర్ గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ "విత్తన సేల్ యాప్" ద్వారా 7 సన్న వరి రకాల విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలను సంబంధిత విత్తన డీలర్లు తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు తమ బాధ్యతగా తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్దకు వెళ్లి తమ వివరాలను విత్తన సేల్ యాప్ లో నమోదు చేయించుకోవాలని సూచించారు.వివరాలు నమోదు చేయించుకోని రైతులకు వరికి ప్రభుత్వం అందించే బోనస్ వర్తించదని స్పష్టం చేశారు. రైతులు 7 సన్న వరి రకాల విత్తనాలు కొనుగోలు చేసిన రైతులందరూ ఆలస్యం చేయకుండా సంబంధిత విత్తన డీలర్‌ను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

## ధన్వాడ ఎస్సీ బాలుర హాస్టల్ నూతన భవన నిర్మాణానికి రూ.3.22 కోట్ల పరిపాలనా అనుమతి



**ధన్వాడ, జూలై 8 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా ధన్వాడలో ఇప్పుడు ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకున్న కారణంగా నూతన భవన నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. షెడ్యూల్డ్ కాస్ట్స్ డెవలప్‌మెంట్ శాఖ జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.169, తేదీ 07.07.2026 ప్రకారం ధన్వాడ ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ నూతన భవన నిర్మాణానికి రూ.3.22 కోట్ల (రూ.322 లక్షలు) నిధులను ప్రభుత్వం ఆమోదించింది. జిల్లా కలెక్టర్ ప్రతిపాదనల మేరకు, ప్రస్తుతం ఉన్న శిథిల భవనాన్ని తొలగించి ఆధునిక సౌకర్యాలతో కొత్త హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ పనులను నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ నిధులు రాష్ట్ర బడ్జెట్‌లోని షెడ్యూల్డ్ కాస్ట్స్ డెవలప్‌మెంట్ శాఖ కేటాయింపుల నుంచి విడుదల చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతన భవనం నిర్మాణం పూర్తయితే ధన్వాడ ప్రాంతానికి చెందిన ఎస్సీ విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి హాస్టల్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నూతన భవనానికి నిధులు మంజూరు అయ్యేలా ప్రత్యేక చొరవ చూపడం పట్ల ధన్వాడ ప్రాంత ప్రజలు, విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న హాస్టల్ నూతన భవనం కలను సాకారం చేసిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి కి ధన్వాడ ప్రాంత ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఆమె చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు ఘన నివాళి



**మిడ్జిల్, జూలై 8(జనంసాక్షి):** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌస్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గౌస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అల్వాల్‌రెడ్డి వెంకటయ్య, నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జహీర్, విజయ్‌కుమార్, ఉస్మాన్, నరసింహ, భాస్కర్‌రెడ్డి, బాలయ్య, కృష్ణ, వెంకటయ్య, పర్వతాలు, సంపత్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు



**నారాయణపేట, జూలై 8(జనంసాక్షి):** దివంగత నేత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నారాయణపేట సివిఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎంతో ప్రజాదరణ పొందిన నాయకులు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి సంక్షేమ పథకాలు ఎంతో మంది పేదలకు అండగా నిలిచాయి. ఆయన చేసిన సేవలు ప్రజల మనసుల్లో ఎప్పటికీనిలిచిపోతాయన్నారు.ఆయన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ల రవీందర్ రెడ్డి, కర్రె వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు మహేష్, రాజ్ ఘాట్, జిల్లా అధికార ప్రతినిధి వకీల్ సంతోష్, మాజీ మార్కెట్ చైర్మన్ సరేఫ్ నాగరాజు, అమీరుద్దీన్ అడ్వకేట్, బోయ రమేష్, షార్న ప్ప భాస్కర్ రెడ్డి సీతారామ్ రెడ్డి పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

## కర్ణాటక అక్రమ బ్యారేజీలను అడ్డుకోండి.. ఆర్డీఎస్ బాట పట్టిన బీఆర్ఎస్ నేతలు

- **అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి**
- **అన్ని పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలి**
- **ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నీటి దోపిడీని అరికట్టాలి**
- **సాగు నీటి విషయంలో అన్యాయం జరిగితే పోరు బాట తప్పదు**



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 8 (జనంసాక్షి):** ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు తుంగభద్ర నదిపై అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తూ తెలంగాణ నీటిని దోచుకుంటున్నాయని భారత రాష్ట్ర సమితి తీవ్ర స్థాయిలో ఆరోపించింది. ఈ జల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ప్రాంతానికి పోరుబాట పట్టారు.కర్ణాటక ప్రభుత్వం కేంద్ర జలసంఘం కృష్ణా బోర్డు అనుమతులు లేకుండానే తుంగభద్ర నదిపై కురుడి (2 టీఎంసీలు), చిక్కలపర్వి (2.5 టీఎంసీలు), చుక్కలమంచి (5 టీఎంసీలు) బ్రిడ్జి కం బ్యారేజీలను అక్రమంగా నిర్మిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

కర్ణాటక పరిధిలో ఉన్న రాజోలి డైవర్షన్ స్కీమ్ ను బుధవారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, సారథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక పరిధిలో అక్రమంగా ప్రాజెక్ట్ లను నిర్మించి, తెలంగాణ కు సాగునీరు అందకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. దీనికి తోడు ఏపీ జలచౌర్యం కు పాల్పడుతున్నారని, దీంతో దిగువన ఉన్న తెలంగాణ లోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. కనీసం 5 టీఎంసీలు నీరు కూడా అందటం లేదని అన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి కర్ణాటక ప్రభుత్వం తో మాట్లాడటం తో పాటు, అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేయాలనీ, కేంద్ర జల సంఘం తో మాట్లాడి నీటి వాటాను సాధించాలన్నారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరపున పోరుబాట తప్పదని హెచ్చరించారు. జిల్లా రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని వారి తరపున పోరాడి సాగు నీరు అందే వరకు ఉద్యమిస్తూనే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి,చిట్టెం రామ్మోహన్ రెడ్డి,అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్,మరియు బీఆర్ఎస్ నాయకులు బి హనుమంతు,పరమేశ్వర్ రెడ్డి, నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు



**కృష్ణ, జూలై 8 (జనంసాక్షి):** కృష్ణ మండలం ముడుమాల్ శివారులో మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఆ టిప్పర్ ను కృష్ణ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## దసరా లోపు పిఆర్ సి ప్రకటించాలి లేదంటే ఉద్యమ కార్యాచరణ పిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు



**రాజాపూర్, జూలై 8(జనంసాక్షి):** పీఆర్టీయు టీఎస్ రాజాపూర్ మండల శాఖ అధ్యక్షులు ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి. మదన్ మోహన్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. దసరా లోపు పీఆర్ సీ ప్రకటించాలని లేదంటే ఉద్యమ కార్యాచరణ రూపొందించామని తెలియజేశారు. ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిన టెట్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, అలాగే ప్రమోషన్లతో కూడిన సాధారణ బదిలీలను ఆలస్యం చేయకుండా చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే కెజిబివి లలో పనిచేసే సిబ్బందికి మినిమం టైమ్ స్కేల్ ను వర్తింప చేయాలని, సమ్మేకాలానికి వేతనాలు చెల్లించాలని కోరారు . ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, పెండింగ్ సమస్యల పరిష్కారం, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపు, ఆరోగ్య భద్రత, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన సీపీఎస్ ను రద్దుచేసి ఓ ఓపీఎస్ ను అమలు చేయాలన్నారు. రాజాపూర్ మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించిందని, పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు నమోదు కావడం సంఘంపై ఉపాధ్యాయుల విశ్వాసానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీ ఆర్ టీ యు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎల్లయ్య , మండల ఉపాధ్యక్షులు శివప్రసాద్ , అజీజ్ , జయవర్ధన్ రెడ్డి , విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖిల్లాలో అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**ఖిల్లా ఘనపురం, జులై8(జనంసాక్షి):** అప్పులు బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం ఉదయం 10:00 గంటల సమయంలో సిద్ధె రాము (28) తండ్రి చంద్రయ్య, కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేకపోవడం ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడికి గురయ్యాడని తీవ్ర మనస్థాపం చెందిన రాము ఘన్‌పూర్ శివారులోని ఈద్గా సమీపంలో ఉన్న మోదుగ చెట్టుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని మృతిచెందినట్లు రాము తండ్రి చంద్రయ్య పిర్యాదులో పేర్కొన్నారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## సిఎం, మంత్రి, ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం



**నారాయణపేట జూలై 8(జనంసాక్షి) :** నారాయణపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు రైతు భరోసా నిధులను సకాలంలో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు భరోసా నిధులను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలి అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమాని కి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కర్రే వెంకటేష్ గౌడ్,మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి పాటు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు మహేష్, రాజ్ ఘాట్, జిల్లా అధికార ప్రతినిధి వకీల్ సంతోష్, మాజీ మార్కెట్ చైర్మన్ సరేఫ్ నాగరాజు,సీతారామ్ రెడ్డి పట్టణ మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కారణజన్ముడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- వనపర్తిలో ఘనంగా వైఎస్ 77వ జయంతి వేడుకలు
- శివసేన రెడ్డి అధ్యక్షతన మంత్రులు, ఎమ్మెల్యే పాల్గొని నివాళులు



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 8 (జనంసాక్షి):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కారణజన్ముడని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన నిమిత్తం విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి తదితరులతో కలిసి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి మంత్రులు, ఎమ్మెల్యే, శివసేన రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆయన అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా కోట్లాది కుటుంబాలకు భరోసా కల్పించిన మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ఆయన చూపిన మార్గంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మాజీ డీసీసీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, మండలాధ్యక్షుడు నక్క రవి కిరణ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశాల్లో సత్తా చాటిన పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు







**బిజినేపల్లి, జూలై 8 (జనంసాక్షి):** మండల పరిధిలోనిపాలెంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) మరోసారి తన విద్యా ప్రతిభను జాతీయ స్థాయిలో చాటుకుంది. కళాశాల తెలుగు విభాగానికి చెందిన విద్యార్థులు కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియూఈటీ–2026)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశవ్యాప్తంగా విశిష్ట ర్యాంకులు సాధించడం ద్వారా కళాశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు.తెలుగు విభాగానికి చెందిన సంగిశెట్టి శైలజ (హాల్ టికెట్ నెం. 230330356352023, రోల్ నెం. టిఎల్ 040100005) దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా 4వ ర్యాంకు సాధించి కళాశాల చరిత్రలో మరో గర్వకారణంగా నిలిచారు. అలాగే కంచ మల్లేశ్వరి (హాల్ టికెట్ నెం. 230330356352014, రోల్ నెం. టిఎల్040100001) ఆల్ ఇండియా 27వ ర్యాంకు, బి. శేఖర్ (హాల్ టికెట్ నెం. 230330356352005, రోల్ నెం. టిఎల్040100002) ఆల్ ఇండియా 46వ ర్యాంకు సాధించి తమ ప్రతిభను జాతీయ స్థాయిలో చాటారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు దేశవ్యాప్తంగా నిర్వహించిన అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షల్లో విశేష ర్యాంకులు సాధించడం విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం, కళాశాలలో అందుతున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రాములు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నిరంతర శ్రమ, క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధన పట్ల అంకితభావం ఉంటే ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో అత్యున్నత విజయాలు సాధించగలరని ఈ ఫలితాలు నిరూపించాయని అన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థులు దేశవ్యాప్తంగా పోటీ పడి అగ్రస్థానాల్లో నిలవడం కళాశాలకు మాత్రమే కాకుండా మొత్తం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఈ విద్యార్థులు దేశంలోని ప్రముఖ సెంట్రల్ యూనివర్సిటీలలో ఉన్నత విద్యను అభ్యసించి విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తున్నారని, పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం, అకాడమిక్ ప్రోత్సాహం అందించడం వల్లనే ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు.తెలుగు విభాగ అధ్యాపకులు విజేత విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయాలు భావి విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కూడా విజేతలను ఘనంగా అభినందించి, ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి కళాశాల ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.సియూఈటీ--2026లో పాలెం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సాధించిన ఈ అరుదైన విజయంతో కళాశాల మరోసారి విద్యా నాణ్యత, ప్రతిభ, క్రమశిక్షణకు చిరునామాగా నిలిచిందని విద్యావర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## అంగన్‌వాడీ పోస్టులకు పోటాపోటీగా దరఖాస్తులు

- 22 టీచర్ పోస్టులకు 434 మంది పోటీ
- సీడీపీఓ ఆకాశ దీప్తి

**మల్దకల్ జూలై 8(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఉత్తర్వుల మేరకు, మల్దకల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్,హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ముగిసిందని ప్రాజెక్ట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆకాశ దీప్తి తెలిపారు.మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె పేర్కొన్నారు.పోస్టుల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు అంగన్‌వాడీ టీచర్స్,మల్దకల్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 22 ఖాళీలు ఉండగా,వీటికి రికార్డు స్థాయిలో 434 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు సగటున 19 మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అంగన్‌వాడీ హెల్పర్స్,మొత్తం 4 సహాయకురాలి ఆయా ఖాళీలు ఉండగా, వీటికి 19 మంది అర్హులైన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలిస్తామని సీడీపీఓ తెలిపారు. బుధవారము చివరి తేదీ కావడంతో ఎక్కువమంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు.ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, పూర్తిగా ప్రభుత్వ మార్గదర్శకాలు మెరిట్ ఆధారంగానే అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఆకాశ దీప్తి చేశారు.

# భరోసా సెంటర్ ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- అనంతరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు





**నాగర్‌కర్నూల్, జూలై 8 (జనంసాక్షి):** బాలలు, మహిళలపై జరిగే వేధింపులు, హింస, లైంగిక దాడులు వంటి ఘటనల్లో బాధితులకు తక్షణ సహాయం, చట్టపరమైన రక్షణ, వైద్య సేవలు, మానసిక పరామర్శ, కౌన్సెలింగ్ వంటి సేవలను ఒకే చోట అందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. మంత్రి భరోసా సెంటర్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి అక్కడ కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. బాధితులకు అందించనున్న సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు భయాందోళనలకు గురికాకుండా, వారికి ఆత్మవిశ్వాసాన్ని కల్పించే వాతావరణంలో సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రతి బాధితుడికి మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ, సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, ఇప్పటివరకు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలు, బాధితులకు అందించిన సహాయ సహకారాలు, కౌన్సెలింగ్ సేవలు, కేసుల పరిష్కారంలో తీసుకున్న చర్యలు, పునరావాస కార్యక్రమాల గురించి మంత్రికి వివరించారు, భవిష్యత్తులో భరోసా కేంద్రం సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు చేపట్టనున్న చర్యలను కూడా ఎస్పీ వివరించారు. ప్రభుత్వ లక్ష్యం భద్రతా భావాన్ని జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, భరోసా సెంటర్ నిర్వాహకులు, జిల్లా అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## తిమ్మాజీపేటలో ఎస్ఐఆర్
# డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్, జూలై 8 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించిన డిజిటలైజేషన్ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల జాబితా సవరణ కార్యక్రమం పారదర్శకంగా, వేగవంతంగా కొనసాగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న పనితీరును సమీక్షిస్తూ, ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, వాటి నమోదు, డేటా ఎంట్రీ, డిజిటలైజేషన్ పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఫారాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు 24వ తేదీల్లోగా నిర్ణీత గడువులోపు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైనదని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు.

# ప్రభుత్వ భూమి కబ్జా.. ఆపై ఆయిల్ ఫాం సాగు

- భూమి కబ్జాతో బాటలేక పై భూములు బీడు
- మూడేళ్లుగా రిటైర్డ్ ఉపాధ్యాయుడి పోరాటం
- పట్టించుకోని అధికారులు



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 8(జనంసాక్షి):** నారాయణపేట మండలం అభంగాపూర్ శివారులో కోటకొండకు చెందిన వ్యక్తి కరుబసప్ప ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ఆభూమిలో ఆయిల్ ఫాం సాగు చేస్తున్నాడు. అంతే కాకుండా ఆక్రమించిన ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేయడంతో ఆపై భాగంలో ఉన్న దాదాపు 50 ఎకరాలకు పైగా బాటలేక సభ్యులు బీడుగా మారాయి. ఈ విషయాన్ని కోటకొండకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ గత మూడేళ్లుగా పోరాటం చేస్తున్న రెవిన్యూ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. కరుబసప్ప సర్వే నెంబర్ 524 ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సర్వే లో తేలినా ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని చంద్ర శేఖర్ తెలిపారు. ఈ వ్యవహారం మొత్తం తహశీల్దార్ అవినీతి కారణంగానే జరిగిందని తెలిపారు. కాగా ఫిర్యాదు చేస్తే తననే కేసు పెడతానని తహసీల్దార్ భయపెడుతున్నారని అన్నారు. ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రం సమర్పించినా న్యాయం జరగడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఆయిల్ ఫాం సాగు చేస్తూ ప్రభుత్వ పరంగా సబ్సిడీ పొందుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అవ్వక్తి సహకరిస్తున్న నారాయణపేట తహశీల్దార్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు ఖిల్లాలో చైర్మన్‌గా క్యామ
# నవనీత ప్రమాణస్వీకారోత్సవం



- ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి
- పార్టీ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలి
- నాయకులు మూడావత్ రవి నాయక్

**ఖిల్లా ఘనపురం 8, జులై (జనంసాక్షి):** మండల కేంద్రంలోని స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో ఘనపురం, పెద్దమందడి రెండు మండల మార్కెట్ యార్డ్ చైర్మన్ కార్యవర్గం ప్రమాణోత్సవ కార్యక్రమంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు ఇట్టి కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు మేఘా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా క్యామ నవనీత వారి కార్యవర్గం ప్రమాణోత్సవ చేస్తారని ఈ సమావేశానికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని ఈ సందర్భంగా పార్టీ నాయకులు రవి నాయక్ తెలిపారు. అనంతరం మండల కేంద్రం లో నూతనగా ఏర్పాటు చేసిన ఏ ఎం సి మండల కార్యాలయాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు.

# బీజేపీ కార్యాలయ కార్యదర్శిగా ధ్యారపోగు సుబ్రహ్మణ్యం

- నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ
- పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచన



**వనపర్తి, జూలై 8 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వనపర్తి జిల్లా కార్యాలయ కార్యదర్శిగా వనపర్తి పట్టణానికి చెందిన ధ్యారపోగు సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు శ్రీ దుప్పల్లి నారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ధ్యారపోగు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, తనపై పార్టీ అధిష్ఠానం ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, విస్తరణతో పాటు ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాల అమలుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. శ్రీశైలం, కేతూరి బుడ్డన్న, జిల్లా ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, మీడియా సెల్ కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, దళిత మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు ఆగపోగు కుమార్, పట్టణ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, పట్టణ దళిత మోర్చా అధ్యక్షుడు ఆగపోగు చాణిక్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శ్రీ ధ్యారపోగు సుబ్రహ్మణ్యంకు శుభాకాంక్షలు తెలిపారు.

# అనాధికార తవ్వకాలతో పర్యావరణానికి పెనుముప్పు

- అక్రమ మైనింగ్ పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- గణేష్‌పూర్‌లో అక్రమ మైనింగ్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ సైదా



**న్యాల్‌కల్, జులై 08, (జనంసాక్షి):** ప్రభుత్వం, ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా.. పర్యావరణానికి పెనుముప్పు, ప్రజానీకానికి హాని కలిగించడం, రోడ్డు ప్రమాదాలకు కారకులైన మైనింగ్ నిర్వాహకులు, మైనింగ్ ప్రోత్సహిస్తున్న వ్యక్తులపై శాఖపరమైన కేసులు తప్పవని జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ హెచ్చరించారు. ఇటీవల తాజాగా.. న్యాల్ కల్ మండలం, గణేష్ పూర్, తదితర గ్రామాల్లో అక్రమంగా మైనింగ్ కొనసాగించడంపై వచ్చిన ఫిర్యాదుతో పాటు సంగారెడ్డి జిల్లా మైనింగ్ అధికారుల ఆదేశం, విచారణ నేపథ్యం మేరకు బుధవారం జహీరాబాద్ గ్రామీణ సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్, పోలీస్ బృందంతో కలిసి గణేష్ పూర్ గ్రామంలో ప్రభుత్వ భూముల్లో అనాధికారంగా కొనసాగుతున్న మైనింగ్ ప్రదేశాన్ని తనిఖీ చేశారు. అనంతరం హద్నూర్ పోలీస్ స్టేషన్ లో.. మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ వివరిస్తూ.. మైనింగ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఎర్రరాయిని తవ్వి తీయడం, ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రవేట్ భూముల్లో అక్రమంగా మైనింగ్ కొనసాగించే వ్యక్తులు ఎంతటి వారైనా వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేనియెడల 100కు సమాచారం ఇవ్వాలని మండల ప్రజానీకానికి స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో స్థానిక సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిపాల్ రెడ్డి ఉన్నత పదవులు అలంకరించాలి

**- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



**తూప్రాన్ జూలై 8(జనంసాక్షి):** ప్రజా నాయకుడు చిట్కుల మహిపాల్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. మైపాల్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేకులు కట్ చేసి శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిపాల్ రెడ్డి తన శిష్యుడైనందుకు గర్వపడుతున్నానని ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ప్రజా నాయకుడిగా ఎదగాలని కోరుకుంటున్నాను తెలిపారు .ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి నాయకులు ధర్మేందర్, జావిద్ భాషా, అఫ్సర్ అభిమానులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



**సదాశివపేట, జూలై 8(జనంసాక్షి):** మండలంలోని చందాపూర్ గ్రామంలో గత మూడు రోజులుగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం గ్రామంలోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో శిఖర ధ్వజస్తంభ, నవగ్రహ నాగేంద్ర స్వామి ప్రతిష్టాపన మహోత్సవం, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవానికి గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఉత్సవాలకు వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు, తాలూకా ప్రధాన కార్యదర్శి పట్ల శివకుమార్, సదాశివపేట మండల అధ్యక్షుడు పట్లోళ్ల నాగేశ్వర్, చాట్ల నరేందర్, నాగరాజ్, బాయికాడ వీరన్న, చిలపల్లి సంగమేశ్వర్, మహేష్ స్వామి, వెంకట్రావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకులచే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మూడు రోజులపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# గౌడల జీవనాధారంపై అగ్నికీలలు.. ఘటనాస్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్



**బెజ్జంకి,జూలై 8,(జనంసాక్షి):** మండల కేంద్రంలో గౌడ కులస్తుల జీవనాధారమైన తాటి, ఈత చెట్లు అగ్ని ప్రమాదంలో కాలిపోవడం తో బుధవారం మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా బాధిత గౌడ కులస్తులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.తాటి,ఈత చెట్లు కాలిపోవడం వల్ల గౌడ కుటుంబాల జీవనోపాధికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే తగిన నష్టపరిహారం అందించి, అన్నివిధాలా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పరిశీలనలో బెజ్జంకి సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్లు,గౌడ సంఘం నాయ కులు,గౌడ కులస్తులు,బీఆర్ఎస్ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కుటుంబాలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

**- ప్రతి ప్రభుత్వ పథకంలో తొలి ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యం**

**- సర్పంచ్ చిలుముల సతీష్**

**బెజ్జంకి,జూలై 8,(జనంసాక్షి):** మండలంలోని వీరాపూర్ గ్రామంలో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కుటుంబాలకు ప్రత్యేక గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిలుముల సతీష్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిలుముల సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో తొలి ప్రాధాన్యత కల్పించే ఉద్దేశంతో ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్డు ద్వారా అర్హులైన కుటుంబాలకు వివిధ ప్రభుత్వ పథకాల అమలులో ప్రాధాన్యత లభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి,విద్యార్థుల ప్రోత్సాహం,తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్యపై మరింత విశ్వాసం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం

**- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 8 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణ మౌలిక సదుపాయాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులతో కలిసి వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల మరుగుదొడ్లు, వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, వెంటనే ఎస్టిమేషన్లు రూపొందించాలని ఆదేశించారు. వివో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రతి వారం కనీసం రెండుసార్లు సందర్శించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, రూఫ్ లీకేజీలు, స్టోరేజ్ రూములు వంటి మౌలిక వసతులను పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. అలాగే ఏడు మండలాల్లో ప్రతిపాదిత 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, బీఎస్ఎన్ఎల్ టవర్లు, వివో భవనాల ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్లకు ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, డీఆర్డీఓ జ్యోతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలి

**- అర్హులను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కా ఇళ్లు మంజూరు చేయాలి**

**- రెండో విడతలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి**

**- ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 8 (జనంసాక్షి):** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు అందేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై ప్రక్రియపై హౌసింగ్ పీడీతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ విడత కి సంబంధించి...గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యతనిస్తూ అర్హులను ఎంపిక చేయాలని తెలిపారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 78 మంది మండల గెజిటెడ్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని మొబైల్ యాప్ ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉండి గుడిసెల్లో నివాసం ఉండే వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనర్హులు లబ్ధి పొందకుండా, పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయా మండలాల వారీగా సమీక్షిస్తూ, గ్రౌండింగ్, స్లాబ్, రూఫ్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలన్నారు.మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తూ గ్రౌండింగ్, బేస్‌మెంట్, రూఫ్ దశల వారీగా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించేలా సమన్వయంతో పని చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిజమైన పేదలందరికీ గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్స్ , మండల గెజిటెడ్ అధికారులు డిఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# సంగమేశ్వర జలాల కోసం పాదయాత్ర చేపడదాం

**- బీఎల్‌వోలు, బీఎల్ఏలు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి**

**- పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టండి**

**- మాజీ మంత్రి హరీశ్ రావు**



**సంగారెడ్డి బ్యూరో, జూలై 8(జనంసాక్షి):** సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే నినాదంతో నారాయణఖేడ్ నుంచి జోగిపేట, జహీరాబాద్, అరేజింతల్ వరకు పాదయాత్ర నిర్వహిద్దామని మాజీ మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు. బుధవారం ఆందోల్ మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలోపై అవగాహన కార్యక్రమం ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీష్ రావు హాజరై మాట్లాడారు... సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టుల ద్వారా లక్ష ఎగరాలకు సాగునీరు అందించాలని నినాదంతో పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (సర్) పై ఎప్పటికప్పుడు కార్యకర్తలు చురుకుగా పాల్గొని, నమోదు ఫారాలను తప్పులు లేకుండా నింపించాలని మాజీ మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలని, రెండుచోట్ల ఓటరు నమోదుకు అవకాశం లేదని తెలిపారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన ఆయన, విద్యార్థులకు స్కాలర్‌షిప్, యాదవులకు గొర్రెల పంపిణీ, దళిత బంధు వంటి హామీలు అమలు కాలేదన్నారు. రైతుబంధు, రుణమాఫీ, పంటల కొనుగోలు, సాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఆందోల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.